


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 17-11-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 37 సంచిక : 64 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### భారతదేశ వ్యవసాయంలో

# సుస్థిరత సాధించాలి

### సీఎం దార్శనికత భవిష్యత్తుకు మార్గం

### కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్





విశాఖపట్నం : ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోందని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అభివర్ణించారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికత, ప్రణాళికలకు ప్రధాని మోడీ సహకారం ఎల్లప్పుడూ వుంటుందని పేర్కొన్నారు. సాంకేతిక అభివృద్ధితో వ్యవసాయ రంగంలో ముందుకు దూసుకుపోతున్న సీఎం అభినందనీయుడన్నారు.రైతన్నకు నీటిని సమృద్ధిగా చేకూర్చడం ద్వారానే వ్వవసాయానికి భరోసా ఇవ్వగమని అందుకు కేంద్రంతో కలసి రాష్ట్ర ప్రభుత్వం శత విధాలా ప్రయత్నిస్తోందని అన్నారు. దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆహార కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని కానీ లాల్ బహదూర్ శాస్త్రి ప్రవేశపెట్టిన కొన్ని సంస్కరణల వలన కరువు నుండి బైటపడగలిగామని అన్నారు. దేశంలో ప్రస్తుతం తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి సాధించేలా అనేక రకాల పెట్టుబడులు, పరిశోధనలు జరుగుతున్నాయని అందుకు శాస్త్రవేత్తలు నిత్య కృషీవలులుగా పరిశోధనలు చేస్తున్నారని

తరువాయి 2లో

### టెక్నాలజీని ఉపయోగించి

# మరింత వ్యవసాయాభివృద్ధి

- మారుతున్న అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ ఉత్పాదకత పెంచాలి
- వ్యవసాయంలో దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్
- అగ్రిటెక్ 2వ రోజు సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు స్పష్టీకరణ



విశాఖపట్నంః గతంలో ఐటికి ప్రాధాన్యత నివ్వడంతో ఐటి రంగంలో ఆంధ్రప్రదేశ్ అగ్ర స్థానంలో నిలిచిందని, ఇప్పుడు వ్యవసాయ రంగాభివృద్ధికి దోహదం చేసే టెక్నాలజీని ఉపయోగించి సాంకేతిక సహకారంతో వ్యవసాయ రంగాన్ని అగ్ర స్థానంలో నిలపాలన్నదే తన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు గురువారం ఉదయం జరిగిన అగ్రిటెక్ సదస్సులో 2వ రోజు ప్రసంగించారు. శాస్త్రవేత్తలు, విశ్లేషకులు చెప్పిన అభిప్రాయాలు సేకరించి వాటిని అమలు చేయడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ రంగంలో ఇకపై ఐటిరంగాన్ని

తరువాయి 2లో

## రైతులతో చంద్రబాబు ముఖాముఖి

## రైతు మేథస్సును కొనియాడిన సీఎం




విశాఖపట్నం: గుంటూరు జిల్లా రైతు మేకా రాధాకృష్ణ మూర్తి ప్రసంగం ముఖ్యమంత్రి చంద్రబాబును విపరీతంగా ఆకర్షించింది. గురువారం రైతులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో రాధాకృష్ణమూర్తి మాట్లాడారు. సాగులో తన

తరువాయి 2లో



## ఏపీ ప్రభుత్వం టయోటాతో ఒప్పందం

- కాలుష్య నివారణ కొరకు విద్యుత్ వాహనాల వాడకం
- సీఎం వల్లనే ఈ ఘనత సాధించాం
- ఐటీ, పంచాయితీరాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్

అమరావతి: విద్యుత్ వాహనాల వినియోగంపై ప్రముఖ వాహన తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం

తరువాయి 2లో

## ఏపీపీఎస్సీ గ్రూప్-2 మార్కులు వెల్లడి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 మార్కుల వివరాలను వెల్లడించింది. ట్రైబ్యునల్‌లో ఏపీపీఎస్సీకి అనుకూలంగా తీర్పు వెలువడిన వెంటనే మార్కులను వెబ్ సైట్‌లో ప్రకటించింది.

పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయంటూ కొందరు అభ్యర్థులు ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు.

ట్రైబ్యునల్‌లో వాదనలతో కొంతకాలంగా గ్రూప్-2 ఫలితాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఎట్టకేలకు ట్రైబ్యునల్‌లో ఏపీపీఎస్సీకి అనుకూలంగా తీర్పు రావడంతో మార్కుల మెరిట్ జాబితా ఆధారంగా తుది ఫలితాల వెల్లడికి ఏపీపీఎస్‌సీ ఏర్పాట్లు చేస్తోంది.

# పోలవరం అధ్యయన యాత్ర



### ఆరు బస్సుల్లో బయలుదేరిన ఏపీ ప్రజాప్రతినిధులు


### పోలవరం సందర్శన అనంతరం విశాఖకు ప్రయాణం

అమరావతి: కళాశాల విద్యార్థులకు వివిధ అంశాలపై నిర్వహించే అధ్యయన యాత్ర తరహాలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ తొలిసారిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నిర్వహించింది. విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి 6 అమరావతి బస్సుల్లో సందడిగా ఈ పర్యటన సాగింది.

పశ్చిమగోదావరి జిల్లాలోకి బస్సులు ప్రవేశించగానే విప్ చింతమనేని ప్రభాకర్ తన స్వగ్రామం

తరువాయి 2లో

## టేకిట్ ఈజీ



పోలవరం ప్రాజెక్టు చూడడానికి మంత్రులు, ప్రతినిధులు వస్తున్నారట!
ఏం చెప్తారో చూడడానికి వెళ్దామా!

### ప్రభుత్వ అప్రజాస్వామిక

# విధానాలను ఎండగడతాం

### జగన్ వద్ద గ్రూప్-1 అభ్యర్థుల ఆవేదన

### పదో రోజుకు చేరుకున్న ప్రజాసంకల్పయాత్ర



కర్నూలు : ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు, టీడీపీ ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టడమే లక్ష్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర పదో రోజుకు చేరుకుంది. ఆళ్లగడ్డ నుంచి ఆయన గురువారం ఉదయం పాదయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి పెద్దచింతకుంట, భాగ్యనగరం, రామచంద్రాపురం క్రాస్‌రోడ్, కొండా పురం, దొర్నిపాడు మీదుగా యాత్ర కొనసాగుతుంది. భాగ్యనగరంలో వైఎస్ జగన్...పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా గ్రూప్-1 అర్హత

తరువాయి 2లో



# విప్‌గా కిడారి నియామకం సిగ్గుచేటు

**- పార్టీ ఫిరాయించిన వ్యక్తి చేతుల్లోకి ఫిరాయింపు చట్టమా**

**- బాబు పాలనలో ప్రజాస్వామ్యం హాస్యాస్పదం**

అమరావతిః ప్రభుత్వ విప్‌గా అరుకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావుని ముఖ్య మంత్రి చంద్రబాబు నియమిచండం సిగ్గు చేటని అనకాపల్లి పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు, గుడివాడ అమర్ నాథ్ విమర్శించారు. పార్టీ ఫిరాయించిన వ్యక్తి చేతుల్లోకి ఫిరాయింపు నిరోధక చట్టం పెట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేయడమేనన్నారు. వైఎస్సార్ సీపీ తరుపున గెలిచిన ఎమ్మెల్యేలను టీడీపీలో చేర్చుకోవడంపై ఫిరాయింపుల చట్టం ఉల్లంఘించారంటూ ఇప్పటికే స్పీకర్‌కు, గవర్నర్‌కు వైకాపా ఫిర్యాదు కూడా చేయడం జరిగిందన్నారు. ఈ ఫిర్యాదుపై ఎటువంటి చర్యలు తీసుకోనందున అసెంబ్లీ సమావేశాలను తాము బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. చట్టాలపై గౌరవం లేని టీడీపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న అసెంబ్లీని వైకాపా నేతలు బహిష్కరించి ప్రజాక్షేత్రంలో నిలిచారన్నారు.

దీనిపై సమాధానం చెప్పలేని చంద్రబాబు చివరకు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి కూడా సిద్ధపడ్డారని దుమ్మెత్తిపోశారు. వైకాపా తరుపున అరుకు ఎమ్మెల్యేగా గెలిచిన కిడారి సర్వేశ్వరరావు టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజీకి లొంగిపోయి, ఓట్లేసి గెలిపించిన ప్రజలను వంచనకు గురి చేసిన నయవంచకుడని విమర్శించారు. తన పదవీ వ్యామోహానికి ప్రజల ఆశలను, ఆకాంక్షలను తెలుగుదేశానికి తాకట్టు పెట్టిన మోసకారి నాయుకుడు కిడారి అని వాగ్బాణాలు సంధించారు. ప్రజలను మోసం చేసి, సీటు ఇచ్చి గెలిపించిన పార్టీని నమ్మంచి మోసం చేసిన వ్యక్తికి ప్రజాప్రాతనిధ్య చట్టంలో అత్యంత పవిత్రమైన ఫిరాయింపు నిరోధక చట్టం చేతుల్లో పెట్టడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగజారుడుతనానికి నిలువెత్తు నిదర్శనమన్నారు.

పార్టీ ఫిరాయించిన నాయకుడు కిడారి సర్వేశ్వరరావు విప్‌గా పని చేయడం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి కళంకమంటూ రాష్ట్ర రాజకీయంలో ఇదో చెరగని మచ్చగా మిగిలిపోతుందన్నారు. ప్రజాస్వామ్యంపై ఏమాత్రం గౌరవం ఉన్నా సరే కిడారి సర్వేశ్వరరావు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి అదే అరుకు నియోజకవర్గంలో గెలిచి టీడీపీ ప్రభుత్వంలో విప్ పదవి చేపట్టాలని సవాల్ చేస్తున్నామని అమర్ నాథ్ పేర్కొన్నారు.

## పర్యాటక రంగంలో పుదుచ్చేరికి ప్రథమస్థానం

**- మంత్రి మల్లాడి**




యానాం : ఢిల్లీలో ఇండియా టూడే సర్వేలో పుదుచ్చేరికి పర్యాటక రంగంలో ప్రథమస్థానం దక్కిందని పుదుచ్చేరి పర్యాటకశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు తెలిపారు. గురువారం ఢిల్లీలో టూరిజం అవార్డు ప్రధానోత్సవంలో చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు పర్యాటక రంగంలో ప్రథమ స్థానం రావడం ఎంతో ఆనం దాన్ని ఇచ్చిందన్నారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో పుదుచ్చేరికి మూడు అవార్డులు దక్కాయి. పర్యాటక రంగంలో ప్రథమం, మంచిపరిపాలన (ముఖ్యమంత్రి), లా అండ్ ఆర్డర్ పెద్ద రాష్ట్రాల్లో ఎక్కువ అవార్డులను హర్యానా కైవసం చేసుకోగా, చిన్న రాష్ట్రాల్లో పుదుచ్చేరికి ఎక్కువ అవార్డులు వచ్చాయి. కేంద్రమంత్రి నితిన్‌గడ్కారీ చేతులమీదుగా ఈ అవార్డులను పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి. నారాయణసామి మంత్రి మల్లాడి మల్లాడి పుదుచ్చేరి డిజిపి సునిల్‌కుమార్ గౌతమ్‌లు అవార్డులు అందుకున్నారు. 16 నెలల కాలంలో పర్యాటక రంగంగా అభివృద్ధి పరిచిన పుదుచ్చేరిని ఇతర 17 చిన్న రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలతో పోల్చి పర్యాటక రంగంగా ప్రథమస్థానంలో నిలవడం ఎంతో గర్వకారణంగా ఉందని మంత్రి మల్లాడి ఉందన్నారు.

## 20, 21 తేదీల్లో యానాంలో రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడల పోటీలు

యానాం : యానాంలోని డాక్టర్ వై.ఎస్.ఆర్.ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియం, జి.ఎం.సి.బాలయోగి స్టేడియంలలో పుదుచ్చేరి రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడల పోటీలు ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రాంతీయ విద్యాశాఖాధికారి కాలే సాయినాథ్ తెలిపారు. ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది కబడ్డీ, వాలీబాల్ బాలుర అండర్-19 కేటగిరీలలో, షటిల్ బ్యాడ్మింటన్ బాలుర విభాగం 14, 17, 19 కేటగిరీలు, క్యారమ్స్ బాల,బాలికలకు మూడు కేటగిరీలలో పోటీలు జరుపుతామన్నారు. పుదుచ్చేరి నాలుగు జోన్లనుంచి 192 మంది, కారైకాల్ రెండు జోన్ల నుంచి 96 మంది, మాహే జోన్ నుంచి 48, యానాం నుంచి 48 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని, ఆటల పోటీల నిర్వహణకు 50 మంది అధికారులు వస్తారని వెల్లడించారు. వీరందరికీ వసతి కల్పించడానికి మహాత్మాగాంధీ బాలుర హైస్కూల్, రాజీవ్‌గాంధీ ఆంగ్ల మాధ్యమ పాఠశాల, కమలానెహ్రూ బాలికోన్నత పాఠశాల, జాకీర్ హుస్సేన్, ఇందిరాగాంధీ, కామిశెట్టి పరశురామ వరప్రసాదరావు నాయుడు ప్రాథమిక పాఠశాలల్ని సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలు, ఇతర అంశాలగురించి వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జోనల్ క్రీడల నిర్వాహక కార్యదర్శి ఐవీకే మోహన్, పీఈటీలు నక్కల సుబ్బన్న, చింతం రామకృష్ణ, పాలికి ప్రకాష్, కొప్పనాతి భాస్కర్, పాము సత్యనారా యణ, వినకోటి సన్యాసిరావు బృందం పాల్గొన్నారు.

## వన సమారాధనతో ఐక్యతా భావం పెంపొందుతాయి

**- మేజిస్ట్రేట్ ఎమ్. సుబ్బారావు**



ఆలమూరు : వన సమారాధనతో అందరిలో ఐక్యతా భావం పెంపొందుతుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎమ్. సుబ్బారావు అన్నారు. ఆలమూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేజిస్ట్రేట్ సుబ్బారావు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె. నారాయణరెడ్డి, ఎస్.ఆదినారాయణమూర్తి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ భవన నిర్మాణాలను పరిశీలించిన సిడిపిఓ విజయశ్రీ

ఆలమూరు : ఆలమూరు మండలంలో నిర్మాణంలో వున్న అంగన్‌వాడీ భవనాలను కపిలేశ్వరపురం ఐసిడిఎస్ సిడిపిఓ బి.విజయశ్రీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె నిర్మాణదారులతో మాట్లాడుతూ త్వరితగతిని నిర్మాణాలు పూర్తిచేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచ్‌లు, సూపర్‌వైజర్ నాగమణి, ఆయా గ్రామ అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు

## చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ

తాళ్లరేవు : జాతీయ, గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో తాళ్లరేవు ఆదర్శ ప్రాథమిక పాఠశాల చిన్నారులు ప్రతిభ కనబరిచినట్లు ఎంఇఒ ఎ మంగయ్యమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో పాఠశాల ఐదవ తరగతిచదువుతున్న విద్యార్థి ఎం ప్రవీణ్ జిల్లాస్థాయిలో మొదటిస్థానం సాధించగా ఆర్ హరిచరణ్ తృతియ స్థానం సాధించినట్లు తెలిపారు. ప్రథమస్థానం సాధించిన ప్రవీణ్ విజయవాడ గుణదలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఈ నెల 16 తేదీన పాల్గొన్నట్లు తెలిపారు. ప్రతిభ కనభరిచిన చిన్నారులను ఎంపిపి టేకు మూడి అనంతలక్ష్మి, జడ్‌పిటిసి పి. రామలక్ష్మి, సర్పంచ్ ఇ. శ్రీనివాసు, ఎంపిడిఒ సిహెచ్ చినబాబు, తదితరులు అభినందించారు.

## ఆన్‌లైన్ సేఫ్టీపై అవగాహన సదస్సు

యానాం: యానాంలోని పలు పాఠశాల విద్యార్థులకు ఇంటర్‌నెట్ ఫైబర్‌కు సంబంధించి ఆన్‌లన్ సేఫ్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ అధ్వర్యంలో చైల్డ్ లైన్ దోస్తీ వారోత్సవాలో జరిగింది. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు ఆన్‌లన్ సేఫ్టీపై చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ ప్రియంక అవగాహన కల్పించారు. ఇంటర్ నెట్ వల్ల దారితీసే అనార్థలను ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల దుర్వినియోగం వలన కలిగే అనర్థాలపై వివరించారు. బాలల హక్కులను కాపాడుటకోసం యానాంలోని చైల్డ్‌లైన్ సంస్థ పనిచేస్తుందన్నారు, ఈ కార్యక్రమంలో నున్నా వెంకటరామ క్రిష్ణారావు, సంస్థ సభ్యులు తాతారావు, కె. దేవి శ్రీదేవి, నూకరత్నం, ఎ. శ్రీనివాసు, జె. సత్యనారాయణ, విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యంపై ప్రత్యేక వైద్య శిబిరం

రావులపాలెం : మండల పరిధి గోపాలపురంలో తరచు ప్రజల అనారోగ్య పాలవుతుండడంతో గ్రామంలో సర్పంచ్ ఆనే లక్ష్మి ముసలయ్య ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బందితో కలసి ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భముగా గురువారం స్థానిక కొత్తకాలనీలో పిహెచ్‌సి సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుచున్న వార్కి మందులు పంపిణీ చేసారు. పంచాయితీ కార్యదర్శి ఎన్. గంగూలి పంచాయితీ సిబ్బందితో పరిశీలించి మురికి నీరు నిల్వ ఉండకుండా బ్లీచింగ్ జల్లించి దోమలు ప్రజలకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎమ్ ఇందిర, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


### అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్‌పిడిఓ

రావులపాలెం : మండల పరిధి దేవరపల్లిలో అంగన్ వాడీ కేంద్రాలను గురువారం ఎమ్‌పిడిఓ వై ఉమామహేశ్వరరావు తనిఖీ చేసారు. ఈ సందర్భముగా ఉపాధ్యాయుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందిస్తున్న పోషకాహార వివరాలు, మంచినీటి సదుపాయం, ఇతర అవసరాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్య షష్ఠికి పందిరి రాట కార్యక్రమం

రావులపాలెం : స్థానిక శివాలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గౌరవ అధ్యక్షులు కొవ్వూరి జగన్నాథరెడ్డి పూజా కార్యక్రమం నిర్వహించి పందిరి రాట కార్యక్రమం చేసారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాన్ని పురస్కరించుకొని పందిరి రాట కార్యక్రమాన్ని చేసినట్లు ఆయన తెలిపారు. షష్ఠి మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధిక సంఖ్యలో భక్తులు రావనుండడంతో ఆలయంలో క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు అన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సిబ్బందితో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### నూకాంబికా అమ్మవారిని దర్శించుకున్న ఏసీపీ



అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇల వేల్పు నూకాంబిక అమ్మవారిని మధురవాడ ట్రాఫీక్ ఏసీపీ కృష్ణవర్మ కుటుంబ సభ్యులతో గురువారం నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ముందుగా ఆలయ అధికారులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొణతాల వెంకటరావు, ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ అనకాపల్లి జర్నలిస్టు అసోషియేషన్ అధ్యక్షులు దాడి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## టెక్నాలజీని ఉపయోగించి మరింతవ్యవసాయాభివృద్ధి

జోడించి అభివృదిద్ధ సాధించడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం వ్వవసాయం సంక్షోభంలో ఉన్నదని పేర్కొంటూ దానిని అధిగమించాలంటే అందుకు నేటి తరానికి తగ్గట్టుగా సాంకేతికతను ఉపయోగించి ఉత్పత్తులను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పండ్లు, కూరగాయలు కోటి ఎకరాల్లో ఉత్పత్తి సాగుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉన్న సాగునీటి సమస్యను అధిగమించేందుకు ప్రణాళికలు వేస్తున్నామని, ముఖ్యంగా సూక్ష్మ నీటి ప్రాజెక్టులపై దృష్టి సారించుదా మన్నారు. రైతాంగంలో మధ్య తరగతి ప్రజానీకం ఎక్కువగా ఉండడంతో వారిని టెక్నాలజీ సాయంతో పంటను అభివృద్ధి చేయించి తగిన లాభాలు సంపాదించ గలిగేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. మన రాష్ట్రంలో చాలామంది విద్యా వంతులంతా రైతు కుటుంబం నుంచి బయటకు వచ్చే వారేనని వారంతా రైతాంగ సమస్యపై దృష్టి సారించాలని కోరారు. ప్రజారోగ్యమే ధ్యేయంగా పని చేయడం వలన సగటు మనిషి జీవనకాలం 5 సంవత్సరాలు పెరిగిందని ఏపీలో ప్రతీ మనిషి సుఖజీవనం పొందాలని సూచించారు.

పంట సాగుబడికి నీటి సమస్యను అధిగమించేందుకు నదుల అనుసంధానాన్ని చేపట్టామని, రైతుకు నీటి సమస్య తీర్చేందుకే పట్టిసీమ ప్రాజెక్టు చేపట్టడం జరిగిందని అన్నారు. పోలవరం ప్రాజెక్టును కూడా త్వరగా పూర్తి చేసి రాష్ట్రాన్ని సశ్యశ్యామలం చేసేందుకు కృషి చేయడం జరుగుతోందని స్పష్టం చేశారు.

## భారతదేశ వ్యవసాయంలో సుస్దిరత సాధించాలి

ఫలితాలు సాధిస్తున్నారని, వారికి కృతజ్ఞతలు అని తెలిపారు. ప్రోటీన్లు అధికంగా లభించే వరి వంగడాలను రూపొందించడం జరుగుతోందని అన్నారు. పాలఉత్పత్తి, మత్స్యపంట ఎగుమతుల్లో భారతదేశం ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఉద్యాన వనాల పెంపకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకుంటున్న చర్యలు ప్రోత్సాహకరమని అన్నారు. ప్రస్తుతం 40 లక్షల హెక్టార్లలో జరుగుతున్న ఈ సాగును కోటి ఎకరాలకు విస్తరించాలనుకోవడం అభినందనీయమన్నారు.

భారతదేశంలో అన్ని రకాల శీతోష్టస్థితులలో పండే పంటలను అధికంగా పండిస్తున్నారని ఒకప్పుడు ఆహార కొరతతో ఉండే రాష్ట్రం నేడు మిగులు ఆహారాన్ని అందించడం గర్వకారణమని అన్నారు. రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువులతో వ్యవసాయాన్ని పెంచడంతో రైతు ఆదాయం బాగా పెరుగుతోందన్నారు. 2022 నాటికి వ్యవసాయంలో సుస్థిరత సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. రైతు తమ బిడ్డలను రైతుగా మార్చే రోజులు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పిట్ కాంపిటేషన్‌లో పాల్గొన్న ఐదుగురు ప్రతినిధులను ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు కంభంపాటి హరిబాబు, అవంతి శ్రీనివాసరావు, కె. నారాయణ, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం అధ్యయన యాత్ర

దుగ్గిరాలలో అందరికీ అల్పాహార విందు ఏర్పాటు చేశారు. చింతమనేనికి పోటీగా ఏలూరు ఎంపీ మాగంటి బాబు కొయ్యలగూడెం వద్ద స్వాగత విందు ఏర్పాటు చేసి వివిధ రకాల తినుబండారాలతో అందరినీ బలవంతపెట్టారు. అక్కడి నుంచి పట్టిసీమ వెళ్లిన ప్రజాప్రతినిధులకు తమ ప్రాంతంలో పండిన పంట కంకులతో స్థానిక రైతులు ఘనస్వాగతం పలికారు. గోదావరి నుంచి పంపులద్వారా నీటిని ఏవిధంగా తోడేదీ తెలుసుకున్న నేతలు అక్కడి నుంచి తోడిన నీటిని ఎత్తిపోసే డెలివరీ పాయింట్‌కు వెళ్లి నీటివిడుదలను ఆసక్తిగా తిలకించారు. మంత్రి నారా లోకేశ్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పట్టిసీమ నీటిలో పూలు వేసి హారతి ఇచ్చారు.

పట్టిసీమ పర్యటన అనంతరం 3గంటల ప్రాంతంలో ప్రజాప్రతినిధులు పోలవరం చేరుకున్నారు. అక్కడ నిర్మాణ పనులు తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. అసెంబ్లీ తరపున అందరికీ ఈ తరహా పర్యటన ఏర్పాటు చేయడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. పోలవరం పర్యటన ముగిశాక ప్రజాప్రతినిధులు అక్కడి నుంచి బస్సుల్లోనే విశాఖలో జరుగుతున్న అంతర్జాతీయ వ్యవసాయ సదస్సులో పాల్గొనేందుకు బయలుదేరారు.

చంద్రబాబు వల్లే ఈ ఘనత సాధించాంః మంత్రి లోకేశ్

పట్టిసీమ ఎత్తిపోతలను మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే బాలకృష్ణ, ఇతర ఎమ్మెల్యేలు పరిశీలించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. 100 టీఎంసీల నీటిని కృష్ణా, గుంటూరు జిల్లాకు ఇచ్చామని, కృష్ణాడెల్టాలో మిగిలిన నీటిని రాయలసీమకు తరలించడం వల్లే అనంతపురంలో కియా మోటర్స్ పరిశ్రమ వచ్చిందన్నారు. అపర భగీరథుడు చంద్రబాబు వల్లే ఈ ఘనత సాధించామని మంత్రి తెలిపారు. పట్టిసీమ వద్దన్న వాళ్లు ఇక్కడకు వచ్చి వాస్తవాలు తెలుసుకోవాలన్నారు.

## ఏపీ ప్రభుత్వం టయోటాతో ఒప్పందం

కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్‌తో టయోటా ఎండీ హకిటో టచీబానా గురువారం అమరావతిలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. విద్యుత్ వాహనాలను మన దేశంలో ప్రవేశపెట్టడానికి చాలా సమస్యలు ఉన్నాయన్నారు. విద్యుత్ వాహనాల అమలుకు అవసరమైన వాతావరణాన్ని అన్ని రాష్ట్రాలు సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. టయోటా సంస్థ ఉచితంగా ఇచ్చిన వాహనాలను రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా పరిశీలిస్తామన్నారు.

టయోటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌తో తప్ప మరే రాష్ట్రంతోనూ ఈ ఒప్పందం చేసుకోలేదని తెలిపారు. విద్యుత్ వాహనాల ద్వారా కాలుష్య సమస్యను అధిగమించవచ్చని లోకేశ్ పేర్కొన్నారు.

## రైతులతో చంద్రబాబు ముఖాముఖి

అనుభవాన్ని వివరించారు. రాధాకృష్ణమూర్తి ప్రసంగం ముఖ్యమంత్రిని ఆకట్టుకుంది. వెంటనే ఆయనను వేదికపైకి పిలిపించి సన్మానించారు. ఆయనకున్న తెలివి మంత్రికి, అధికారులకు లేదంటూ చమత్కరించారు.

విశాఖ అగ్రిటెక్ సదస్సులో భాగంగా రెండో రోజు గురువారం రైతులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో రైతు మేకా రాధాకృష్ణ మూర్తి మాట్లాడుతూ పశువులు వేసిన 50 నుంచి 100 కిలోల పేడను పొలంలో స్ప్రెడ్ చేశామన్నారు. అంతేగాని నారు పోయడంగానీ, తీయడంగానీ, దమ్ము చేయడంగానీ, గట్లు బాగుచేయడం గానీ, దుక్కు దున్నడంగానీ, పాయలు తీయడం.. ఏ పని లేకుండా డైరెక్టుగా సోయింగ్ చేశామని ఆయన చెప్పారు. ప్రభుత్వం లెక్క ప్రకారం ఒక ఎకరా మాగాణికి 60 మంది కూలీలు కావాలని, అందులో 30 మందిని తగ్గించామని, దాంతో సగం డబ్బులు మిగిలాయని, ఆవు పేడను గత్తంగా వాడిన తర్వాత ఏమీ చేయమని, వ్యవసాయంలో ముఖ్యంగా ఖర్చుండేది కలుపని, కలుపుని కలుపుతోనే నిర్మూలించవచ్చునని రాధాకృష్ణ మూర్తి చెప్పారు. అది ఎలా అంటే...

క్రీ.పూ. 6వ శతాబ్దంలో సురపాలుడు, నృపాలుడు అనే మునులు వృక్షాయుర్వేదం అనే గ్రంథం రాశారని, దాంట్లోనుంచి కలుపు మొక్కలను తీసుకుని, వాటిని పెనంపై వేసి కాల్చి మసి చేయాలని, ఆ మసి 100 గ్రాములు తీసుకుని, 100 గ్రాముల పంచదార, అర లీటరు నాటు ఆవుపాలు ఈ మూడు 200 లీటర్ల నీళ్లలో కలిపి దానిని స్ప్రే చేస్తే 48 గంటల్లో మొవ్వు మాడిపోతుందని రాధాకృష్ణ మూర్తి తెలిపారు.

కనుక ఖర్చు తగ్గించుకునే విధానంలో ఇది బాగా పనిచేస్తుందని ఆయన అన్నారు.

రైతు మేధస్సును కొనియాడిన సీఎం

రైతు రాధాకృష్ణ వ్యాఖ్యలపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ మంత్రి, సెక్రటరీ, డైరెక్టర్, వైస్ ఛాన్సలర్ కంటే రాధాకృష్ణకు ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని కొనియాడారు.

నాలెడ్జ్ అంటే యూనివర్శిటీలో కాదని, క్షేత్రస్థాయిలో అమలు చేసి ఫలితాలు రాబట్టటమే నిజమైన నాలెడ్జ్ అని అన్నారు. రైతు రాధాకృష్ణమూర్తి చెప్పినట్లు అందరూ అలవాటు చేసుకుంటే మనకు సమస్యలు ఉండవని సీఎం అన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణమూర్తిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. అనంతరం రాధాకృష్ణను సన్మానించారు.

## ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ఎండగడతాం

సాధించిన అభ్యర్థులు... జననేతను కలిశారు. 2011 నుంచి తాము ఉద్యోగాల కోసం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేసిన తప్పుకు రెండోసారి పరీక్ష నిర్వహించి కూడా అర్హత సాధించిన అభ్యర్థులను ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. 30 రోజుల్లో ఫలితాలు ప్రకటిస్తామని చెప్పి, ఇప్పటివరకూ న్యాయం చేయలేదన్నారు. ఈ విషయాన్ని ఏపీపీఎస్సీ సెక్రటరీ దృష్టికి తీసుకు వెళతామని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు.

కాగా అంతకు ముందు వైఎస్ జగన్‌ను పెద్ద చింతకుంటలో రైతులు కలిశారు. తమ బాధలను రైతులు ఏకరువు పెట్టారు. రైతుల సమస్యలను సావధానంగా విన్న ఆయన..ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టితో రైతులు నష్టపోయారు. అయినా ప్రభుత్వం స్పందించడం లేదు. ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదు.

మేము అధికారంలోకి వస్తే అన్ని పంటలకు ముందుగానే ధర ప్రకటించి ఆ మేరకు కొంటాం. అని హామీ ఇచ్చారు.

పాదయాత్రలో భాగంగా వైఎస్ జగన్... దారిపొడవునా ఎదురైన ప్రజలందర్నీ పలకరించుకుంటూ... వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకెళ్తున్నారు.

రైతులు, యువత ఆత్మహత్యలు చేసుకోవద్దని...... త్వరలోనే మంచి రోజులొస్తాయని భరోసా కల్పిస్తున్నారు.

### ఉడా చిల్డ్రన్ థియేటర్‌లో

# అల్పాహార పథకం పైలెట్ ప్రాజెక్టు ప్రారంభం

విశాఖపట్నం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆకలితో ఉండకుండా శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ చేపడుతున్న ఉదయం అల్పాహార పథకం పైలెట్ ప్రాజెక్టును తన చేతుల మీదుగా ప్రారంభించడం చాలా ఆనందంగా వుందని, ఇటువంటి మంచి సేవా కార్యక్రమాన్ని చేస్తున్న ట్రస్ట్ సభ్యులకు తన ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నారని రాష్ట్ర మానవ వనరులశాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక ఉడా చిల్డ్రన్ థియేటర్‌లో శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్, ముద్దేనహళ్లి, బెంగుళూరు వారు చేస్తున్న ఉదయం అల్పాహార సేవా కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క పిల్లవాడు కూడా ఆకలితో బడికి వెళ్లకూడదు అన్న ఆలోచనతో ఎంతో కమిట్‌మెంట్‌తో పనిచేస్తున్న ఈ కార్యక్రమం విజయవంతం అవ్వాలని, ముందుగా తన నియోజకవర్గం భీమిలితో పాటు పెదగంట్యాడ, చినగదిలిలో గల 200 ప్రభుత్వ పాఠశాలలో 1 నుండి 5వ తరగతి చదువుచున్న సుమారు 12వేల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం పెట్టడం ఎంతో సంతోషించదగిన విషయమన్నారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహాయ సహకారాలు ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నదని, అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలతో పాటు ఉచిత పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేయడం జరుగుతున్నదన్నారు.

శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ సెక్రటరీ ఆనందరావు మాట్లాడుతూ ట్రస్ట్‌ను 2012వ సంవత్సరంలో ప్రారంభించడం జరిగిందని, ఉదయం అల్పాహారం పథకం ఒక ప్రభుత్వ పాఠశాలలో 80మంది పిల్లలతో ప్రారంభించి 11 రాష్ట్రాలలో 15 వందల పాఠశాలలో లక్షమంది వరకు ఉచిత అల్పాహారం అందించడం జరుగుతున్నదన్నారు.

ఇంతేకాకుండా ప్రత్యేక మెడికల్ క్యాంపులను పెట్టి విద్యార్థులకు ఆరోగ్యపరంగా దంత, కంటి పరీక్షలు, కళ్ల అద్దాల పంపిణీ చేస్తున్నామన్నారు. నిరుపేదలకు దుస్తుల పంపిణీ చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు జయప్రకాష్, మధుసూదనరావు, డిఇఓ నాగమణి, డిప్యూటీ డిఇఓ రేణుక, సర్వశిక్ష అభియాన్ పిఓ శివప్రసాద్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూములు ఆక్రమణలపై

# డిప్యూటి కలెక్టరు పరిశీలన



పెందుర్తి : ప్రభుత్వ భూములు ఆక్రమణలు జోరందుకున్నాయన్నా విషయంపై స్థల పరిశీలనకు జిల్లా భూపరిరక్షణ డిప్యూటి కలెక్టరు ప్రమీల గాంధీ గురువారం పెందుర్తి మండలంలోను, జి.వి.ఎం.సి పరిధిలో ఉన్నా 70,71 వార్డులలో ఉన్నా క్రిష్ణారాయపురం, పురుషోత్తపురం, చినముషిడివాడ పెందుర్తి ప్రాంతాలలో తన సిబ్బందితో పర్యటించారు. క్రిష్ణా రాయపురం గ్రామంలో శ్వాశానంకు వేళ్లే మార్గం లో గెడ్డ ప్రాంతాన్ని భూ ఆక్రమణ దారులు మట్టితో కప్పడం ఆమె గుర్తించారు. అలాగే ఇదే ప్రాంతంలో చెరువు గర్భన్ని మొత్తం మట్టితో కప్పేయ్యడం ఆమె గుర్తించారు. జ్యోతినగర్ కాలనీలో చెరువు దూరక్రమణలు అవుతున్నాట్లు, అలాగే పెందుర్తి, చిన ముషిడివాడ ప్రాంతాలో భూ ఆక్రమణలు చెరువు గర్భాలు, గెడ్డలు ఆక్రమణలు జరిపి, ఆ స్థలాలను జీరాయితీ భూములు రిజిస్ట్రేషన్లు చేయడం, ఈ భూములు కొనుగోలు చేసిన ఆసామిలు ఈ భూముల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం ఆమె గుర్తించారు. ఈ భూ వ్యవహారాలు గుట్టు విప్పేందు కు వెంటనే ఈ చెరువుల్లో, గెడ్డలకు ఆనుకోని ఏంతా ప్రభుత్వ భూమి ఉంది. ఏంతా ఆన్యాక్రాంతం అయిందనే విషయాన్ని విచారణ చేయ్యల్సిందిగా డిప్యూటి కలెక్టరు ప్రమీల గాంధీ సంబందిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ పెందుర్తి మండలం భారీ గానే ప్రభుత్వ భూమి అన్యా క్రాంతం అవు తున్నట్లు తాము గుర్తించామన్నారు. రికార్డులు పరిశీలన అనంతరం భూ ఆక్రమణ దారులపై తగు చర్యలు చేపడతామన్నారు.

## సిఓపిడి వైద్యంతో 10 ఏళ్లు ఆయష్సును పెంచుకోవచ్చు

**శ్వాసకోశ నిపుణులు డాక్టర్ కె.ఎస్ ఫణీంద్రకుమార్**

అనకాపల్లి : గుండె శ్వాసకోశ వాధ్యులను సకాలంలో గర్తించి తగు జాగ్రత్తలతో పదేళ్ల వరకు ఆయష్షును పెంచుకోవచ్చని శ్వాసకోశ నిపుణులు డాక్టర్ కె.ఎస్ ఫణీంద్రకుమార్ (ఎం.డి) పేర్కొన్నారు.

సిఓపిడి వైద్యం ద్వారా అద్భుతమైన వైద్యాన్ని పొందవచ్చునన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో పాటు స్వగ్రామం కావడంతో అనకాపల్లి కూడా వైద్య సదుపాయాలు అందించాలని నిర్ణ యించినట్లు తెలిపారు.

ప్రతీ ఏటా నవంబర్ రెండు, మూడు బుధవారాలను ప్రపంచ సిఓపిడి గా నిర్వహిస్తామన్నారు. పొగాకు ఉత్పత్తుల వలన కాల్చిన వారితో పాటు పీల్చినవారు కూడా అదికంగా శ్వాసకోశవ్యాధితో బాధపడుతున్నారన్నారు.

పిఎఫ్‌టి వంటి పరికరాలతో వైద్యాన్ని గుర్తించి తక్కువ కాలంలో ఉపశమనం పొంది పదేళ్ళ ఆయుష్షును పెంచుకోవచ్చన్నారు. సమావేశంలో సిప్లా కంపెనీ ప్రతినిధులు రాజశేఖర్, సతీష్‌కుమార్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల అక్రమ అరెస్టులు అన్యాయం

**ఫ్యాప్టో కో-ఛైర్మెన్ జి.మదు**




అచ్యుతాపురం: అరెష్టలతో ఉద్యమాలను ఆపలేరని ఫ్యాప్టో కో-చైర్మెన్ జి.మదు అన్నారు. ఉపాద్యాయులను అరెష్ట చేయడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రమైన అచ్యుతాపురంలో ఉపాద్యాయులు నిరశన తెలిపారు. ఈ నిరశనలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సామాజిక ఆర్ధిక బద్రతలేని సిపిఎస్ విదానాన్ని రద్దుచేసి, పాత పించన్ విదానాన్ని పునరుద్దరించాలని ఉద్యోగ, ఉపాద్యాయులు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం కనీసం చర్చించకపోవడం అన్యాయమన్నారు. ఈ నేపథ్యంలో ఫ్యాప్టో ఉద్యమ కార్యాచరణకు పూనుకుందన్నారు. చలో అసెంబ్లీకి అనుమతించకపోవడం అప్రజాస్వామికమన్నారు. పలు జిల్లాల నుండి బయలు దేరిన వారిని రైల్యే ష్టేషన్‌లలోను, బస్ ష్టేండ్‌లోను నిర్భందంలోకి తీసుకొని అరెష్ట చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైకరిని మార్చుకొని సిపిఎస్ రద్దుకు అసెంబ్లీలో తీర్మాణం చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జివిబిఎ రాజు, సన్నిబాబు, నూక రాజు, ప్రకాశ్, బి.సత్యనారాయణ, హెచ్‌వి రమణా రావు, మొబీనా బేగమ్‌తో పాటు పలు వురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'మహా అన్నదాన మహోత్సవము' ప్రారంభం



విశాఖపట్నం : అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం విశాఖ నగర శాఖ మరియు ది విశాఖ శ్రీధర్మశాస్తా అన్నదాన ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కైలాసపురం ఆలయ సముదాయం ఆవరణలో గల షిరిడీ సాయిబాబా సన్నిధానంలో వైభవంగా 11వ మహా అన్నదాన మహోత్సవం ప్రారంభమైనది. ఈ కార్యక్రమాన్ని విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ డిప్యూటీ చైర్మన్ పి.ఎల్.హరనాథ్ ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ క్రమం తప్పకుండా గత 10 సంవత్సరాలుగా మాలధారణ చేసిన భక్తులకోసం 41 రోజులపాటు అన్నప్రసాద వితరణ చేయడం ప్రశంసనీయమన్నారు. వీరితోపాటు అతిథులుగా విపిటి కార్యదర్శి శ్రీ హరిచంద్రన్, విపిటి ఎస్ఇ శంకర్ నారాయణ, ప్రముఖ పారిశ్రామికవేత్త మట్టపల్లి హనుమంతురావులు పాల్గొని అన్న ప్రసాద వితరణ చేశారు. సంస్థ అధ్యక్షులు ఎ.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా ఈ అన్నదాన మహోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. సంస్థ కార్యదర్శి జి.వి. వసంతరావు మాట్లాడుతూ మాలధారణ చేసిన భక్తులు తప్పక విచ్చేసి మహా అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని కోరుతూ ఈ నెల16వ తేదిన ప్రారంభమైన ఈ మహా అన్నదాన మహోత్సవం డిసెంబర్ 26వ తేదితో ముగుస్తుందన్నారు. ముందుగా వేదఘోష, కేరళ పంచవాద్యం (మంగళధ్వని)ల మధ్య విఘ్నేశ్వరపూజ, లక్ష్మీ గణపతి హోమం, అయ్యప్పస్వామి పడిపూజ, ప్రత్యేక పూజలు నిర్వహిం చడమైనది. 2000 మందికిపైగా భక్తులు విచ్చేసి మహాన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఎ.వేణుగోపాలరెడ్డి, కార్యదర్శి జి.వి.వసంతరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, నగర శాఖ సభ్యులు, నగర శాఖకు చెందిన ఉప శాఖల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### గ్రంధాలయ వారోత్సవాల్లో

## చిత్రలేఖన పోటీలు




అచ్యుతాపురం: జాతీయ గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన అచ్యుతాపురంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పాటు కళాశాల విద్యార్థులకు గురువారం గ్రంధాలయాధికారి డి.కోటేశ్వర్రావు పర్యవేక్షణలో చిత్రలేకన పోటీలు నిర్వహించారు. ఈ సంధర్భంగా గ్రంధాలయాధికారి డి.కోటేశ్వర్రావు మాట్లాడుతూ గ్రంధాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు చిత్రలేకన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

## సింహగిరీశుని విరాళంగా వెండి దీపపుకుందెలు



సింహాచలం : సింహాద్రినాధునికి విరాళంగా వెండి దీపపు కుందెలను విజయనగరంకు చెందిన తిరుమల హాస్పటిల్ అధినేత డాక్టర్ తిరుమలప్రసాద్, డాకర్ట్ కృష్ణశాంతిలు తమ కుటుంబసభ్యులతో కలసి ఆలయ సహాయ ఆర్వివివిఎస్సెస్ ప్రసాద్ కు అందించారు. రెండున్నర కేజీలు గల దీపపుకుందెలు విలువ రూ.1,70,000/-లు అని దాతలు తెలియజేసారు. ఆలయ మర్యాదలప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం, వేదపండితులచే ఆశీర్వచనం చేయించి ప్రసాదాలను అంద జేశారు. స్వామివారికి భక్తులు, దాతలు ఏమైనా వస్తువులు, ధన, చెక్కు, డిడి రూపేణావిరాళం ఇచ్చినా సంబందిత అధికారివద్ద తగు రసీదు పొందాలని లేదంటే వారు ఇచ్చినా విరాళాలు స్వామివారికి చెందవు అని ఓప్రకటనలో అధికారులు తెలిపారు. డిపాజిట్ చేసిన మొత్తం నుంచి వచ్చిన వడ్డీతో భక్తులు కోరినరోజు అన్నదానం నిర్వహించటం జరుగుతుంది. దాతలకు ఎటువంటి సమాచారం కావాలన్న 949100 0635 నెంబర్ కు సంప్రదించవచ్చు లేదంటే నేరుగా మమ్మల్ని అంటే దేవస్థానం కార్య నిర్వాహణాధికారి వారిని సంప్రదించగలరని కార్యనిర్వాహణాకారి కోడూరి అచ్చుత రామ చంద్రమోహన్ కోరారు.

## సింహాచలేశుని దర్శించుకున్న కాబోయే ప్రభుత్వవిప్



సింహాచలం : సింహాద్రిపై కొలువై ఉన్న వరాహలక్ష్మీనరసింహస్వామి వారిని కాయబోయే ప్రభుత్వవిప్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి ఆర్విివిఎస్ ప్రసాద్ పూలమాల వేసి ఆహ్వానం పలికారు. అర్చక స్వాములు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వీరు కప్ప స్థంబం ఆలింగనం చేసుకుని వేద నాదాల మద్య బేడా ప్రదక్షణ చేశారు. స్వామి వారికి తమ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. దర్శన అనంతరం వేద పండి తులు ఆశీర్వచనం పలికారు. ఆలయ పర్యవేక్షకులు రమణ స్వామివారి శేష వస్త్రంతో సత్క రించి ప్రసాదాలను అంద జేశారు. అనంతరం ఆయ నను మీకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు విప్ గా ప్రకింటించి నం దుకు మీకు ఎలాఉండని ప్రశ్నించగా ఏదైనా మా అధినేత నిర్ణయం అభినందనీయం అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ విప్ ఆదేశాలను ముఖ్యమంత్రి గవర్నర్ సంతకం కోసం పంపారని అక్కడినుండి ఆదేశాలు అయితేనే మేము పూర్తి విప్ గా అనిపించుకుంటాం అన్నారు. ఎప్పటివిధంగానే స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చాం అన్నారు.

### ఆగివున్న లారీ ఢీకొట్టడంతో

## వ్యక్తికి తీవ్రగాయాలు



వరవాడ:లంకెలపాలెం కూడలిలో గురువారం ఆగి ఉన్న లారీని డీకొన్న ఘటనలో పరవాడ మండలం మంత్రిపాలెం గ్రామానికి చెందిన పచ్చిగోరు రమణమూర్తి తీవ్రంగా గాయ పడ్డాడు. తన కారులో అనకాపల్లి వైపు నుంచి వస్తుండగా లంకెల పాలేం జంక్షన్లో ఆగి ఉన్న లారీని దీకొట్టాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో అగనంపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రధమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దీనిపై పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



**37వ వార్డు బీజేవైఎం అధ్యక్షులుగా డోప్పశ్రీనుని నియమిస్తూ విశాఖ నగర బీజేవైఎంఅధ్యక్షులు కూలిపూడి చంద్రశేఖర్ ఉత్తర్వులు జారిచేయడం జరిగింది. ఈ మేరకు పార్టీ అభీష్టానికి వార్డులో భాజాపా బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా విశాఖ నగర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నాగేంద్రకు, నార్త్ కన్వీనర్ డా.సురేష్ సోమయాజులుకు వార్డు ఇన్‌ఛార్జి దక్షిణామూర్తికి కృతజ్ఞతలు తెలియజేశారు.**

### అఫీషియల్ కాలనీలోని

## అపరిష్కృత సమస్యలను పరిష్కరించేందుకు కృషి

గాజువాక: అఫీషియల్ కాలనీలోని అపరిష్కృత సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అఫీసియల్ కాలనీ వెల్ఫేర్ అసోషియోషన్ నూతన అధ్యక్షుడు ఎం.మహాలక్ష్మినాయుడు పేర్కొన్నారు. గురువారం జీవీయంసీ 61వ వార్డు అఫీషియల్ కాలనీ వెల్ఫేర్ అసోషియోషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో అధ్యక్షులుగా ఎం.మహాలక్ష్మినాయుడు, ఉపాధ్యక్షులుగా సి.హెచ్. వెంకటరావు, రమేష్, కార్యదర్శిగా వి.బలరాం, సంయుక్త కార్యదర్శులుగా కె.శ్రీనివాసరావు, వెంకట్రావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా విశ్వనాధ్, బాబ్జి, కోశాధికారిగా హనుమంతరావు, కార్యవర్గ సభ్యులుగా బి.సంజీవరావు, కె.త్రిమూర్తులు, జీ.వి.సుబ్బ రాజు, శ్రీనుబాబు, అడ్వైజర్‌గా రత్తయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్బంగా నూతన అధ్యక్షులు ఎం.మహాలక్ష్మినాయుడు మాట్లా డుతూ కాలనీలో అనేక సమస్యలు అపరి ష్కృతంగా ఉన్నాయని అవి దశలవారిగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికలలో తనను అధ్యక్షులుగా ఎన్నుకున్నం దుకు కాలనీ వాసులకు కృతజ్ఞతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు

## బయోమెట్రిక్ హాజరు

కొయ్యూరు : బయోమెట్రిక్ హాజరుకు సిద్ధం కావాలని ఎంఇఒ బోడం నాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. ట్యాబ్‌ల ద్వారా బయోమెట్రిక్‌ను ఎలా నమోదు చేయాలన్న విషయమై ఆయన రావణాపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఆన్‌లైన్‌లో హాజరు ఎలా వేయాలి, ఆఫ్‌లైన్‌లో ఎలా ఉంటుంది అనే విషయాలను వివరించారు. శిక్షణ అనంతరం ఎంఇఒ విలేకరులతో మాట్లాడారు. మొదట 20 పాఠశాలకు ట్యాబ్‌లు ఇచ్చినట్లు చెప్పారు. వారంతా బయోమెట్రిక్ విధానంలో హాజరు వేయాలన్నారు. త్వరలో అన్ని పాఠశాలల్లో బయోమెట్రిక్ విధానం అమలు చేయనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు విధులకు హాజరు కాకుంటే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## యువత సృజనాత్మకంగా పనిచేయాలి



ఆంధ్రాయూనివర్శిటీ: యువత సృజనాత్మకంగా పనిచేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. గురువారం సాయంత్రం ఏయూ వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ఎంఇఊటివై-భారత ప్రభుత్వం, మీడియా లాబ్ ఏషియా సంయుక్తింగా నిర్వహించిన 'రీసర్చ్ స్కాలర్స్ అండర్ విశ్వేస్వరయ్య పిహెచ్‌డి స్కీం' జాతీయ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సమాజ హితంగా, నూతన ఆవిష్కరణలు జరపాలన్నారు. పరిశోధనల్లో నాణ్యత, నవ్యతలను చూపాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక అంశాలపై పరిశోధనలు జరపాలన్నారు.విశ్వేశ్వరయ్య పిహెచ్‌డి కార్యక్రమం అడకమిక్ కమిటి చైర్మన్, భారత ప్రభుత్వ పూర్వ సాంకేతిక సలహాదారు డాక్టర్ ఎస్.వి రాఘవన్ మాట్లాడుతూ సమస్యను గుర్తించడం కంటే సమస్యను అనుభూతి చెందడం అవసరమన్నారు. నూతనత్వం దిశగా పనిచేయాలనే అభిరుచిని చూపాలన్నారు. అవధులు లేని సమాచారం నేటి యువతకు అందుబాటులో ఉందన్నారు. ఆలోచన నుంచి ఆచరణ దిశగా పయనించడంలో అనే అంశాలు ముడిపడి ఉంటాయనే వాస్తవాన్ని గ్రహించాలన్నారు.

భవిష్యత్తు ఎలా ఉండలనేది మీ ఇష్టంపై ఆధారపడి ఉంటుందన్నారు. పని సులభమైనపుడు ఆకాంక్షలు పెరిగిపోతా యన్నారు. పిహెచ్‌డి పూర్తయ్యే నాటికి జ్ఞానం పొందడంలో మనం ఒక మెట్టు ఎక్కామనే సంతృప్తి ఉండాలన్నారు.

### పుస్తకం చదవడం అలవాటు కావాలి

యలమంచిలి రూరల్ : ప్రతీ వ్యక్తి ఒక విద్యార్ధిగా మారి రోజు పుస్తకం చదవడం అలవాటుగా మార్చుకోవాలని సైన్స్‌ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు చొచ్చుబట్ల నాని అన్నారు. యలమంచిలి మండలం సోమలింగపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రంధాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాల ప్రాదాన్యతను వివరించారు. ఐజాక్ అసిమోవ్ రాసిన సైన్స్ పుస్తకాలను విద్యార్థులకు పరిచయం చేశారు. చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ వి.శ్రీనివాస చక్రవర్తి పంపించిన పుస్తకాలను విద్యార్థులకు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివి.సత్యనారాయణ, సిహెచ్.సునీల్ ఉన్నారు.

# విజయభాను సంపాదకీయం

## వార్నింగ్ టు హ్యూమానిటీ

భారతీయ చింతనలో ప్రకృతికి ఎనలేని ప్రాముఖ్యం ఉన్నది. కానీ ప్రకృతిని చెరబట్టి అభివృద్ధి మోజులో పడిన కాన్నుంచీ రెండు దశాబ్దాలుగా మనదేశంలోనూ పెద్ద ఎత్తున ప్రకృతి విధ్వంసం సాగుతున్నది. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలనే వారిని ప్రగతి విరోధులుగా ముద్రవేయటం జరుగుతున్నది. అడ్డూ అదుపూలేని సహజవనరుల వెలికితీత కొనసాగుతున్నది. వినియోగ వస్తూత్పత్తికి ప్రాధాన్యమిస్తున్నంతగా మానవాళి అవసరాల ఉత్పత్తిపై దృష్టి సారించకపోవటం కూడా సమస్యగా మారింది. ఇప్పటికైనా శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించి పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచుకోవటం అవసరం. మనుషుల దురాశ భూగోళంపై మానవ మనుగడకే ముప్పుగా పరిణమించిందన్న ప్రపంచ శాస్త్రవేత్తల హెచ్చరిక ఆందోళన కలిగిస్తున్నది. నేటి వినాశకర అభివృద్ధి విధానాలు, మితిమీరిన వనరుల వాడకం ఇలాగే కొనసాగితే మన ఇంటిని మన మే తగుల బెట్టుకున్నట్లైందని, భూమి నివాసయోగ్యం కాకుండా పోతుందని అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం మానవాళిని హెచ్చరించటం గమనార్హం. ఈమేరకు 184 దేశాలకు చెందిన పదిహేను వేల మంది శాస్త్రవేత్తలు సం తకాలు చేసిన ఓ లేఖ వార్నింగ్ టు హ్యూమానిటీ, ఏ సెకండ్ నోటీస్ పేరిట విడుదల చేశారు. గతంలోనూ ఇలాగే పర్యావరణ కాలుష్య ప్రమాదం గురించి పలు దేశాలకు చెందిన పదిహేడువందల మంది శాస్త్రవేత్తలు మానవాళికి హెచ్చరిక పేరు తో లేఖ విడుదల చేశారు. కానీ శాస్త్రవేత్తల ఆవేదన అరణ్యరోదనగానే మిగిలిపో యింది. ఏ ఒక్కరూ దాని గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా ఈ 25 ఏండ్ల కాలంలో పరిస్థితులు మరింత దిగజారాయి. అడవుల నరికివేత, వ్యవ సాయంలో రసాయన ఎరువుల వాడకం పెరిగిపోయి గాలి, నీరు కలుషి తం కావడమే కాదు, భూమిని కూడా విషతుల్యం అవుతున్నది. దీంతో పంట దిగుబడులు తగ్గిపోతున్నవి. భూ గర్భ జలాలు కలుషితమై తాగటానికి నీళ్లే కరువై పోతున్నవి. పట్నం నుంచి పల్లె దాకా మంచినీళ్లను కొనుక్కొని తాగే దుస్థితి వచ్చింది. భూమిపై జీవ వైవిధ్యం కొరవడుతున్నది. మహాసముద్రాలు సైతం జీవ రహితంగా మారుతున్నవి. ఒక్క మాటలో చెప్పాలంటే కాలుష్యం కాటుకు సమస్త జీవ రాశి నశించిపోతున్నది. దీనికి మనిషి కూడా మినహాయింపు కాదని గుర్తించగలితేనే మనకు మనుగడ ఉంటుందన్నది శాస్త్రవేత్తల హెచ్చరిక సారాంశం. తరతరాల మానవ వికాస చరిత్రలో పారిశ్రామికాభివృద్ధి ప్రారంభమైన గత రెం డువందల ఏండ్లనుంచే ప్రకృతిని చెరబట్టి దాన్నే ప్రకృతిపై విజయంగా చెప్పుకుం టున్నాం. మరీ ముఖ్యంగా సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ విధా నాలు అవలంబించటం ప్రారంభమైన 1990 దశకం నుంచి మరింత వినాశకర రీతిలో ప్రకృతిపై దాడి జరుగుతున్నది. సహజ వనరులను కొల్లగొడుతూ భూమిని గుల్ల చేసి, అడవులను నరికివేసి అభివృద్ధి పేకమేడలు కడుతున్నాం. కొన్నేళ్లుగా భూతాపం పెరిగిపోతున్నది. భూగో ళం అగ్నిగోళం అవుతున్నది. దీంతో మంచు కరిగి సముద్ర తీర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నవి. భూతాపం రెండు డిగ్రీల సెల్సియస్ పెరిగితేనే ఇంత ముప్పు ఏర్పడుతున్నది. రాబోయే కాలంలో భూతాపం 3.5 డిగ్రీల సెల్సియస్‌కు చేరితే ప్రళయమే! శిలాజ ఇంధనాల విపరీత వినియోగంతో కర్బన కాలుష్యా లు గాలిలోకి వదిలి ప్రాణవాయువును మింగేసి ఊపిరి సలుపని స్థితిలో ఉక్కిరి బిక్కిరి అవుతు న్నాం. దీనికి తాజా ఉదాహరణగా దేశ రాజధాని ఢిల్లీలోని దుస్థితిని చెప్పుకోక తప్పదు. ఢిల్లీలో వాయు కాలుష్యంతో పాఠశాలలకు సెలవులు ప్రకటించే పరిస్థితి ఏర్పడిందంటే కాలుష్యభూతం ఏ రీతిన ఆవహించి ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగానూ, అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఇదే స్థితి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రపంచదేశాలన్నీ కాలుష్య కోరల్లోంచి బయట పడేందుకు ప్యారిస్ ఒప్పందా న్ని చేసుకున్నాయి. కానీ అగ్రరాజ్యం అమెరికా దీన్నుంచి వైదొలుగటం ఆందోళన కలిగించే విషయం. నిజానికి అభివృద్ధి చెందిన పాశ్చాత్యదేశాలు అవలంబిస్తున్న అభివృద్ధి విధానాల వల్లనే భూగోళం కాలుష్యం కోరల్లో చిక్కుకున్నది. అమెరికా నిత్యం తుఫాన్లు , వరదలు, కార్చిచ్చు లాంటి ప్రకృతి విపత్తులతో సతమతమవుతూ కూడా కండ్లు తెరువకపోవటమే విషాదం. కాలు ష్య నివారణకు ఆ దేశాలే ఎక్కు వ బాధ్యత వహించి ఎక్కువ నిధులు కేటాయించాలి. కానీ ఆ దేశాలు తమ ఆధిపత్య విధానాలతో కాలుష్య నివారణ బాధ్యతను అభివృద్ధిచెందుతున్న దేశాలపై తోసేసి మానవాళికి తీరని నష్టం చేస్తున్నాయి. ప్రపంచ శాస్త్రవేత్తల రెండో ప్రకటనతోనైనా కళ్లుతెరిచి వ్యవహరిస్తే మానవాళికి మనగలుగుతుంది.

## సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

### -జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్



విజయనగరం : వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల ప్రగతి పనులను జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ స్వయంగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు జారీ చేస్తున్నారు. నిర్దష్ట సమయానికి మరుగు దొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలిస్తున్నారు. నిర్మాణాల్లో నాణ్యతలు పాటించాలని, నాణ్యతలు పాటించిన వారికే పనులు అప్పగించాలని లక్ష్యాలను సకాలంలో సాధించాలని సూచిస్తున్నారు. ప్రతి గ్రామ పంచా యతీలో సామాజిక మరుగుదొడ్ల నిర్మా ణాలు చేయడానికి ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపిస్తున్నామని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ స్పష్టం చేసారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు స్థలం లేని గ్రామాల్లో సామాజిక మరుగుదొడ్లను నిర్మిస్తామన్నారు. గురువారం సాలూరు మండలం శివరాంపురం, రామభద్రపురం మండలం ఆరికతోట గ్రామాల్లో పర్య టించి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణాల నాణ్యతలలో రాజీ పడవద్దని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలో 1 లక్ష 65 వేల మరుగుదొడ్ల నిర్మాణాలు మొదలు పెట్టాల్సి ఉందని 2లక్షల 27 వేల మరుగుదొడ్లను నిర్మించవలసి ఉందని చెప్పారు. మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి ప్రజలు ముందుకొస్తున్నారని చెప్పారు. ఇసుక ఇతర నిర్మాణ సామగ్రి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టామని చెప్పారు. గిరిశిఖర గ్రామాల్లో తక్కవ వ్యయంతో మరుగుదొడ్ల నిర్మాణా చేపట్టడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.196 గ్రామలను ఇప్పటికే బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించామని స్పష్టం చేసారు.

మరుగుదొడ్ల డాటాలో తప్పులున్నాయని సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 340 కి.మీ. రహదారులను చంద్రన్నబాటలో నిర్మించవలసి ఉందన్నారు. ఇప్పటికే 101 కి.మీ. రహదారులను నిర్మించామని చెప్పారు.

ఈ కార్యక్రమములో మండల ప్రత్యేకాధికారి మెప్మా పి.డి. ఎం. లక్ష్మునాయుడు, తాహశీల్దార్ పి.జనార్ధనరావు, ఎం.పి.డి.ఓ బి. ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## గృహనిర్మాణ సంస్థ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

### మోనిటరింగ్ సెల్ పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి



విజయనగరం : జిల్లా కేంద్రంలోని గృహనిర్మాణ సంస్థ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాలూరు, రామభద్రపురం మండలాల్లో పర్యటించిన వచ్చిన అనంతరం నేరుగా గృహనిర్మాణ కార్యాలయాన్ని చేరుకుని మోనిటరింగ్ సెల్‌ను తనిఖీ చేశారు. అక్కడ ఎవరెవరు సిబ్బంది విధులు నిర్వహిస్తారని డి.ఇ.ని ప్రశ్నించారు. ప్రజల నుండి గృహనిర్మాణ సంబంధ సమస్య లపై ఫిర్యాదులకు, వాటి పరిష్కారానికి మోనిటరింగ్ సెల్ ఏర్పాటుచేస్తూ జారీచేసిన ఉత్తర్వులను చూపించాలని సిబ్బందిని ఆదేశించారు. రోజువారీ ఎన్ని ఇళ్ల నిర్మాణం జరుగుతోంది, ఎన్ని ప్రారంభమయ్యాయో నివేదికను అందించాలని కోరగా ఆ నివేదికను కూడా ఇవ్వలేకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లాలో ఏయే మండలాల్లో ఎన్ని ఇళ్లు ఇంకా నిర్మాణం ప్రారంభం కావలసి వుందో మోనిటరింగ్ సెల్ ద్వారా పర్యవేక్షణ చేయవలసి వుండగా అటువంటి సమాచారం ఏదీ అందించకపోవడంతో దీని నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఇళ్ల నిర్మాణంపై నివేదిక అందించాలని ఆదేశించినప్పటికీ ఆదేశాలను పాటించకపోవడంపై ప్రశ్నించారు. మోని టరింగ్ సెల్ పనితీరుపై సాయంత్రం తనకు వివరణ ఇవ్వాలని హౌసింగ్ పి.డి., సిబ్బందిని ఆదేశించారు.

## అయ్యన్నపాలెం శాఖా కార్యదర్శిగా ఎర్రినాయుడు ఎన్నిక

### సిపిఐ మండల కార్యదర్శి, శాఖా సభ్యులు ఏకగ్రీవ తీర్మానం



మాట్లాడుతున్న పట్టణ కార్యదర్శి రుత్తల అప్పలనాయుడు

నర్సీపట్నం : పట్టణంలోని అయ్యన్నపాలెం శాఖా మహాసభ గురువారం జరిగింది. పట్టణ కార్యదర్శి రుత్తల అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సభ్యులందరూ ఏక గ్రీవంగా బోకం ఎర్రినాయుడుని శాఖా కార్య దర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యన్నపాలెం మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. మౌలిక సదుపాయాల కల్పన అంతంత మాత్రంగానే ఉందన్నారు. పట్టణ కార్యదర్శి మాట్లాడుతూ నర్సీపట్నం పన్నులు 200 శాతం పెంచినా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పంచడంలో పాలకులు విఫలం చెందారన్నారు. పన్నులు పెంపు తగదని సిపిఐ ఆధ్వర్యంలో బంద్ చేపట్టగా ప్రజలు స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి విజయవంతం చేశా రన్నారు. సమస్యలు పరిష్కారానికి ఆందోళనే సరైన మార్గమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివలంక కొండలరావు, జిల్లా సమితి సభ్యులు పాలపర్తి తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

## లాంగ్‌జంప్ కోర్టు ఏర్పాటు

రావికమతం : రావికమతం హైస్కూల్‌కు ఆ గ్రామ వర్తక సంఘం సభ్యులు రూ.10వేల విరాళంతో లాంగ 'జంప్ కోర్టును నిర్మిస్తున్నారు. ఆ హైస్కూల్‌లో ఇప్పటికే రన్నింగ్‌ట్రాక్ ఉంది. ఇక్కడి యువకులు పలువురు లాంగ్ జంప్‌లో మంచి ప్రతిభ కలిగి ఉన్నారు. వారిని మరింతగా ప్రోత్సహించేందుకు ఆ స్కూల్ చైర్మన్ వేపాడ శ్రీను, హెచ్‌ఎం కె.రామలక్ష్మి, పిఈటి లక్ష్మణరావు వర్తక సంఘాన్ని కోరడంతో వారు రూ.10వేలతో నిర్మిస్తున్నారు.

## సమయం (కవి సమయం)

### విరాట్పురుషుని విశ్వరూపం

వదనం - అగ్ని
నేత్రాలు - అంతరిక్షం
చక్షురింద్రీయం - సూర్యుడు
రెప్పలు - రాత్రింబవళ్లు
దవడలు - జలం
నాలుక - రసం
మాటలు - సకల వేదాలు
కోరలు - యముడు
దంతాలు - స్నేహకళలు (పుత్రాది)
నవ్వులు - మాయలు, ఉన్మాదం
కటాక్షాలు - అంతంలేని సృష్టులు
పెదవులు - సిగ్గు, లోభం
రొమ్ములు - ధర్మమార్గాలు
అధర్మ మార్గం - వెన్ను
పురుషాంగం - ప్రజాపతి
వృషణాలు - మిత్రావరుణులు
కడుపు- సముద్రాలు
ఎముకలు - కొండలు
నాడులు - నదులు
రోమాలు - చెట్లు
నిట్టూర్పులు - వాయువులు
అంతంలేని కాలం - ప్రాయం
కర్మలు - సంసారాలు
వెంట్రుకలు - మేఘాలు

... (సశేషం)...

...కవితా రచన
ప్రొ.అప్పాజి భగవాన్

## పంచాంగం

మాసం : కార్తీక; తిథి : చతుర్దశి మ. 2.38
స్వాతి సా. 5.13 వ. 11.03 ల 12.55

శుక్రవారం 17-11-2017

**మేషం :** ఏ విషయంలోను ఒంటెద్దు పోగడ మంచిది కాదు. మీ శ్రీమతి మొండి వైఖరి మీకు చికాకు కలిగిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం. బేకరి, పండ్ల, స్వీట్ వ్యాపారాలు జోరుగా సాగుతాయి. **వృషభం :** గృహోపకర ణాలు, వాహనం అమర్చు కుంటారు. ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేస్తారు. చీటికి, మాటికి ఎదుటివారిపై అసహనం ప్రదర్శిస్తారు. కొంత మంది మీ పలుకుబడి ద్వారా లబ్ధి పొందు తారు. **మిథునం :** ఓర్పు, నేర్పుతో అనుకున్నది సాధిస్తారు. నూతన ప్రదేశాలు సందర్శనలు అనుకిలిస్తాయి. వృత్తుల వారు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటం మంచిది. కోర్టు వ్యవహారాలు, భూ వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఉద్యోగస్తులకు రావలసిన క్లయింలు, అలవెన్సులు ఆలస్యంగా అందుతాయి. **కర్కాటకం:** బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బందులను ఎదుర్కొంటారు. గతంలో పోల్చుకుంటే ప్రస్తుత ఆర్థికస్థితి కొంత మెరుగనిపిస్తుంది. వైద్య రంగాల వారికి గుర్తింపు, కీర్తి ప్రతిష్టలు లభిస్తాయి. **సింహం:** స్త్రీలకు అలంకారాలు, విలాస వస్తువుల మీద మక్కువ పెరుగుతుంది. సంఘంలో మీ కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. దీర్ఘకాలిక సమస్యల శాశ్వత పరిష్కా రానికి బాగా శ్రమిస్తారు. అకాల భోజనం, శారీరక శ్రమ వంటి ఇబ్బందు లెదుర్కొంటారు. ఇసుక, క్వారీ కాంట్రాక్టర్లకు ప్రభుత్వాధికారుల నుంచి వేధింపుల తప్పవు. **కన్య:** రాజకీయ నాయకులు సభ, సమావేశాల్లో పాల్గొంటారు. మనో ధైర్యంతో యత్నాలు సాగించాల్సి ఉంటుంది. ఏజెంట్లు, బ్రోకర్లు, వృత్తుల వారికి సదవ కాశాలు లభిస్తాయి. బంధుమిత్రుల నుంచి ఒత్తిడి, మొహమ్మాటాలు ఎదు ర్కొంటారు. ప్రముఖ ఆలయాల్లో దైవదర్శనాలు అతికష్టం మీద అను కూలిస్తాయి. **తుల:** ఒక స్థిరాస్తి విక్రయించాలనే ఆలోచన స్ఫురిస్తుంది. ధనవ్యయం అధికంగా ఉంటుంది. మీ భావాలు, ఆలోచనలకు మంచి స్పూర్తి లభిస్తుంది. కోర్టు వ్యవహారాలలో ప్లీడర్లకు చికాకులు అధికమవుతాయి. **వృశ్చికం:** ఉపాధ్యా యులకు, విద్యార్థులకు ఒత్తిడి అధికం. ఆర్థిక లావాదేవీలు, కుటుంబ విషయాల పట్ల శ్రద్ధ వహిస్తారు. **ధనుస్సు:** ఎంత శ్రమించినా ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటుంది. స్త్రీలకు షాపింగ్‌లోను, పనివారల విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలుదార్లను ఆకట్టుకుంటారు. **మకరం:** బంధువులతో చిన్న చిన్న కలహాలు జరిగే ఆస్కారం ఉంది. రవాణా రంగాలలో వారికి మిశ్రమ ఫలితం కానవస్తుంది. ప్రముఖుల పరి చయాలు, పాత మిత్రుల కలయిక మీ ఉన్నతికి దోహదపడతాయి. ఆదాయానికి సరి పడని ఖర్చు కానవస్తుంది. **కుంభం:** దూర ప్రయాణాలలో వస్తువుల పట్ల మెళు కువ అవసరం. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి.ముఖ్యమైన పర్యటనలలో అవాంతారాలు ఎదురైనా జయం పొందుతారు. **మీనం:** వ్యాపారాల్లో నష్టాలు, ఆటంకాలు క్రమేణా అధికమిస్తారు. స్త్రీలపై సన్నిహితులు, చుట్టుపక్కల వారి ప్రభా వం అధికంగా ఉంటుంది. వాహనం నిదానంగా నడపటం క్షేమదాయకం.

# భావిభారతపౌరులు దేశసేవ అలవాటు చేసుకోవాలి

## ఎపియుడబ్ల్యూజె పిలుపు




పాయకరావుపేట : జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ (ఎపియుడబ్ల్యూజె) పిలుపు మేరకు పాయకరావుపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పాత్రికేయులు పలు సామాజిక,సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రం నక్కపల్లిలో గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికివెళ్ళి అక్కడి రోగులకు పండ్లు,రొట్టె పంపిణి చేసారు.అనంతరం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు వెళ్ళి అక్కడి ప్రాంగణంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా సమాజసేవలో పత్రికల పాత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన ముగ్గురు బాలికలకు తెలుగు-ఇంగ్లీష్ డిక్షనరీలను బహుమతులుగా అందజేసారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రాకేయుడు కోరాడ చంద్రరావు మాట్లాడుతూ పత్రికల ఆవిర్భావం,వాటి విశిష్టతను వివరించారు.ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే తల్లిదండ్రులు, గురువులు,పెద్దలను పుజించాలని, వారి అడుగు జాడల్లో నడుస్తూ భావి భారత పౌరులుగా దేశానికి సేవ చేయాలని విద్యార్థినులకు సూచించారు. ప్రింట్ మీడియా ప్రధాన కార్యదర్శి నల్లల సుదర్శన్ (విష్ణు) మాట్లాడుతూ దేశంలో ప్రతిపలాపేక్ష లేని రంగమేదయినా వుందంటే అది పత్రికా రంగం మాత్రమేనన్నారు.ఈ రంగంలోఎంతోమంది పాత్రికేయులు తమ కలంతో తమ గళాన్ని వినిపించి పోరాడుతూ అసువులు బాసారన్నారు.మీలో ఎంతమంది ఈ రంగంలోకి రావాలని కోరుకుంటున్నారని విద్యార్థినులను ప్రశ్నించగా ముగ్గురు బాలికలు పత్రికా రంగంపై తమకున్న మక్కువను తెలిపారు.

అలాగే తుని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేవవరపు అర్జునరావు మాట్లాడుతూ నిత్యం పాత్రికేయ వృత్తిలో తమకు ఎదురయ్యే సవాళ్ళను పేర్కొంటూ,సమాజ సేవలో తమవంతు బాధ్యతను వివరించారు.పాయకరావుపేట నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి వెలగా లోవరాజు మాట్లాడుతూ దేశంలో ఒక్క టీ,కాఫీ ధరలకంటే పేపర్ పేపర్ ఖరీదు తక్కువన్నారు.

విశ్వంలో జరిగే అనేక సంఘటనలను మనముంగిటకు తీసుకురావటంలో పాత్రికేయుల చొరవను ప్రశంసించారు.

ప్రిన్సిపాల్ ప్రమీలాదేవి మాట్లాడుతూ పోర్త్ ఎస్టేట్ గా పిలిచే పత్రికా రంగం యొక్క విశిష్టత వెలకట్టలేనిదన్నారు. జర్నలిస్ట్ డే సందర్భంగా తమ పాఠశాల్లో ఇటువంటి చక్కని కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు గణేష్ ,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ , సీనియర్ పాత్రికేయులు సత్యనారాయణ,రాంబాబు, ప్రసాద్ , నాగేశ్వరరావు,నూకరాజు, గణేష్ ,లోవరాజు, కోదండరావు, రమేష్ తదితరులతోపాటు పలువురు పాత్రికేయులు, ఉపాధ్యాయినులు,వైద్యాధికారులు పాల్గొన్నారు.

## నంది అవార్డులపై బండ్ల గణేష్ తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు సంవత్సరాలకు కలిపి ప్రకటించిన నంది అవార్డులపై నిర్మాత బండ్ల గణేష్ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న అవార్డులను సైకిల్ అవార్డులంటూ విమర్శలు చేశాడు. నంది అవార్డుల విషయంలో మెగా ఫ్యామిలీకి అన్యాయం జరిగిందని బండ్ల గణేష్ ఆరోపించాడు.

పేపర్లో నంది అవార్డుల ప్రకటనను చూసి తనకు చాలా కామెడీగా అనిపించిందని ఈ మెగా ప్రొడ్యూసర్ వ్యాఖ్యానించాడు. అసెంబ్లీలో శాసనసభ్యుడిగా ఉండి, అవార్డుల కమిటీకి చైర్మన్‌గా ఉండి ఉత్తమ నటుడి అవార్డు తీసుకోవడం ఎంత వరకు సమంజసం అని బాలయ్యను ఉద్దేశించి బండ్ల గణేష్ ఎద్దేవా చేశాడు. తన సినిమా గోవిందుడు అందరివాడేకు అవార్డు రాకపోవడంపై కూడా బండ్ల గణేష్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఓ చానల్‌లో అవార్డులపై చర్చ కార్యక్రమంలో బండ్ల గణేష్ మాట్లాడుతూ ఎండాకాలం ఎండ కాస్తుంది.. వానాకాలం వానలు పడతాయి.. శీతాకాలం చలేస్తుంది.. అలాగే ఇది టీడీపీ కాలం. వాళ్లేం చెబితే అది వినాలి. లేదా ఇంకో కాలం వచ్చేదాకా వెయిట్ చేయాలి. గోవిందుడు అందరివాడే సినిమాకు ఉత్తమ కుటుంబ కథా చిత్రం అవార్డు వస్తుందని ఆశించాను. రామ్ చరణ్‌కు కచ్చితంగా అవార్డు వస్తుందని అనుకున్నా... కానీ ఇంత పక్షపాత ధోరణి చూపిస్తారని అనుకోలేదు. ఇక చిరంజీవి గారికి ఏదో కండితుడుపు కోసం రఘుపతి వెంకయ్య అవార్డుని ఇచ్చారు అని తన ఆవేదనను వెళ్లగక్కాడు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా దంత పరీక్షలు



నర్సీపట్నం : జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక యక్కల శ్రీనివాస రావు దంత వైద్యశాలలో పాత్రికేయులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యులు శ్రీనివాసరావు పరీక్షలు నిర్వహించి దంత సంరక్షణపై పలు సూచనలు చేశారు. ఈ కార్య క్రమంలో ఏపియుడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు సిహెచ్‌బిఎల్.స్వామి, రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి రాము, నర్సీపట్నం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎం.రాజు, సెక్రటరీ ఏడి.బాబు, సిహెచ్.కిశోర్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు రామకృష్ణ, వివిధ మండలాల పాత్రికేయులు పాల్గొన్నారు.

### త్వరితగతిన మరుగుదొడ్లు నిర్మించకుంటే

# సంక్షేమ పథకాలు నిలుపుదల

### ఎంపిపి సుకల రమణమ్మ



మాట్లాడుతున్న ఎంపిపి సుకల రమణమ్మ

నర్సీపట్నం : మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాన్ని త్వరితగతిన నిర్మించుకోకపోతే సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని ఎంపిపి సుకల రమణమ్మ హెచ్చరించారు. గురువారం వేములపూడి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామాలు దత్తత తీసుకొని, వార్డులు దత్తత తీసుకొని మరుగుదొడ్లు నిర్మించేందుకు కృషి చేస్తున్న అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఐకెపి డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. త్వరితగతిన మరుగుదొడ్లు నిర్మించిన వారిని అభినందిస్తామని అన్నారు.

అనంతరం చంద్రన్న బీమా బాండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జయమాధవి, మాజీ సర్పంచ్ బోళెం నర్సింహమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ మల్లేశ్వరి, ఐకెపి ఏపిఎం సత్తిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ జాని, పంచాయతీ పరిపాలానాధికారి సుబ్రహ్మణ్యం, ధర్మసాగరం పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, గ్రామ పెద్ద మాతునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు అధిక ప్రాధాన్యం




మాట్లాడుతున్న మండల టీడీపీ అధ్యక్షులు రుత్తల శేషుకుమార్

మాకవరపాలెం : రాష్ట్ర ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన నాటి నుంచి విద్యతో పాటు క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తుందని మాకవరపాలెం మండల టీడీపీ అధ్యక్షులు రుత్తల శేషుకుమార్ అన్నారు.

9వ జోన్ గ్రిక్ పోటీలు మాకవరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి జరిగే బాలికల పోటీలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మాకవరపాలెం హైస్కూల్‌కు అన్ని రకాల అభివృద్ధి చేసేందుకు మంత్రి అయ్యన్నపాత్రుడు కృషి చేస్తున్నారని, రూ.14లక్షలతో క్రీడా మైదానంను అభివృద్ధి చేశారన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు చేసిన మార్చ్‌పాస్ట్ అందరిని ఆకట్టుకుంది. పోటీల్లో భాగంగా అండర్-14, అండర్-17 విభాగాల్లో ఆరు మండలాలకు చెందిన విద్యార్థినులు వివిధ పోటీల్లో పాల్గనన్నారు.ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి వబ్బలరెడ్డి వెంకటరమణ, మాకవరపాలెం సర్పంచ్ మాణిక్యం, తామరం సర్పంచ్ చల్లా రత్నం, ఎంపిటిసి నూకరాజు, హరిబాబు, ప్రధానో పాధ్యాయులు పాల్గొన్నారు.

# ముగిసిన భజన పోటీలు



మాట్లాడుతున్న టీటీడీ ధార్మిక సలహా మండలి సభ్యులు నాగేశ్వరరావు

నాతవరం : మండల కేంద్రంలో మూడు రోజుల 72 గంటల పాటు నిర్వహించిన మండల భజన పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా టీటీడీ ధార్మిక సలహా మండలి సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ భజన బృ:దాలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. హిందూ దర్మాన్ని కాపాడాలన్న కృత నిశ్చయంతో తూర్పుగోదావరి జిల్లాలో 400కు పైగా భజన బృందాలు ఏర్పాటు చేశామన్నారు. విశాఖజిల్లాలో నాతవరం మండలం నుంచి భజన బృందాలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుతానికి మండలంలో 40కు పైగా భజన బృందాలు ఉన్నాయన్నారు. కాగా 72 గంటల పాటు జరిగిన పోటీల్లో ప్రథమ స్థానం పెదగొలుగొండపేట, ద్వితీయ స్థానం నాతవరం, తృతీయ స్థానం మర్రిపాలెం భజన బృందాలు నిలిచాయి. వారందరికీ నగదుతో పాటు ప్రోత్సహక బహుమతులు, షీల్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంకంరెడ్డి పార్వతి, జమీలు, మాజీ సర్పంచ్ కామిరెడ్డి కిత్తయ్యనాయుడు, భజన సంఘాల గురువులు ఉన్నారు.

### నవంబరు 26న

# రాజ్యాంగ దినోత్సవంగా జరపాలి

### ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో రాజ్యాంగ పీఠికను చదవాలి : జిల్లా కలెక్టర్



విజయనగరం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబరు 26వ తేదీని రాజ్యాంగ దినోత్స వంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యా లయాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ సంస్థల్లో జరపాలని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ ఆదేశించారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా.బి.ఆర్. అంబేద్కర్‌ను స్మరించుకొంటూ నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవంగా పాటిం చాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో ఆరోజు ఉదయం 11 గంటలకు రాజ్యాంగ పీఠిక (ప్రియాంబుల్)నుసామూహికంగా చదవాలని పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని నమూనా పార్లమెంట్‌ను నిర్వహించడం, భారత రాజ్యాంగ విశిష్టతపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటలు నిర్వహించడం, భారత రాజ్యాం గంపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు రాజ్యాంగ నిపుణులతో ప్రత్యేక ఉప న్యాసాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వ శాఖలకు ఒక సర్క్యులర్ జారీ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఆరోజు ఉదయం 10.30 గంటలకు రాజ్యాంగ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని, కార్యాలయ ఆవరణలో వున్న అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఆడిటోరియంలో జరిగే కార్యక్రమానికి హాజరై రాజ్యాంగ పీఠికను చదవాల్సి వుంటుందన్నారు.

### గ్రంధాలయంలో

# వ్యాసరచన పోటీలు



గ్రంధాలయ ఉత్సవాల్లో పాల్గొన్న సర్పంచ్ కోట నీలవేణి

రావికమతం : జాతీయ గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా మండంలో గల రావికమతం, కొత్తకోట శాఖా గ్రంధాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. స్వచ్ఛభారత్ గ్రామా భివృద్ధికి యువత చేయూత, కాలుష్యంపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కొత్తకోట సర్పంచ్ కోట నీలవేణి పాల్గని మాట్లాడుతూ విద్యార్థులలో ఆహ్లాదకర పోటీ ఉండాలన్నారు. నేడు ఉన్నత శిఖరాలలో ఉన్న ప్రతీ ఒక్కరూ ఏదో విద్యార్థులుగా ఉన్న వారే నన్నారు. వారు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాన్ని అందు కోవాలని శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు ఆర్.కన్నబాబు, సాయిలక్ష్మిలు ఉన్నారు.

# రావాడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### ముఖ్య అతిథిగా హాజరైన పెందుర్తి టిడిపి ఇన్‌ఛార్జి బండారు అప్పలనాయుడు



పరవాడ: పరవాడ మండలము రావాడ పంచాయితీ పరిధి ధర్మారాయుడుపేట స్మశానవాటికలో అభివృద్ధి పనులుకు పెందుర్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి బండారు అప్పలనాయుడు గురువారము భూమిపూజ చేశారు. పదిలక్షలు ఎన్‌అర్‌జిఎస్ నిధులు నుండి చేపట్టనున్న నిర్మాణ పనులకు కొబ్బరికాయకొట్టి ప్రారంభించారు. గ్రామల్లో స్మశానవాటికల అభివృద్ధినీ గత ఏ ప్రభుత్వము చేయని విధంగా తెలుగుదేశంపార్టీ ప్రభుత్వము చేస్తుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ వియ్యపులక్ష్మి, ఎమ్ పిటిసి కావలి వెంకటలక్ష్మి, జిల్లాతెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ వియ్యపుచిన్న తదితరులు పాల్గొన్నారు.

# ఒకే కాన్పులో ముగ్గురు ఆడపిల్లల జననం



జన్మించిన ఆడశిశువులుల

నర్సీపట్నం : ఒకే కాన్పులో నర్సీపట్నం మండలం వేములపూడి పంచాయతీ ఉప్పరాసగర మారుమూల గ్రామానికి చెందిన నక్కా రామ్‌ప్రకాష్, తల్లి సునీతలకు ముగ్గురు ఆడ బిడ్డలు జన్మించారు. వీరు చాలా ఆరోగ్యవంతంగా ఒక్కొక్కరు మూడున్నర కేజీలు ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఒకే కాన్పులో ముగ్గురు ఆడపిల్లలు జన్మించడం అరుదని వైద్యులు తెలిపారు.

# మొగలిపాలెం రోడ్డు నిర్మించాలి

కాజులూరు : మండలంలో గల బంధపూడి మొగలిపాలెం శివారు గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన గ్రామాల నుంచి, మొగలిపాలెం చేరుకునేందుకు గొల్లపాలెం నుంచి కూరాడ డ్రైన్ గట్టు వెంబడి మూడు కిలోమీటర్ల పొడవునా రోడ్డు ఉంది. అయితే ఈ రోడ్డు పూర్తిగా శిధిలమై రాళ్లు లేచిపోయాయి. అడుగడుగునా గోతులు పడటంతో వాహనాలు అదుపుతప్పి ప్రతి రోజు ప్రమాదాలు పాలవుతున్నారు. ఉన్నతా ధికారులు స్పందించి మొగలిపాలెం రోడ్డు నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# కాజులూరు-దుగ్గుదురు మధ్య వంతెన నిర్మించాలి

కాజులూరు: గొల్లపాలెం-కుయ్యేరు రహదారిలో కాజులూరు-దుగ్గుదురుల మధ్య అండ్రంగి డ్రైయిన్‌పై వున్న వంతెన పూర్తిగా శిధిలమైంది. ఈ వంతెన సుమారు 70 సంవత్సరాల క్రితం నిర్మిం చిన వంతెన ఇరుకుగా మారడానికి తోడు శిధిలమై కూల డానికి సిద్ధంగా వుండటంతో దీనిపై ప్రయాణించడానికి ప్రజలు భయ పడుతున్నారు. వంతెన రక్షణ గోడలు పగుళ్లు తీసి పెచ్చులూడి పడుతున్నాయి. వంతెన కిందిభాగంలో ఏర్పాటు చేసిన ఇనుప బద్దెలు తుప్పు పట్టి విరిగిపోయేందుకు సిద్ధంగా వున్నాయి. ఈ వంతెనపై సుమారు 30 గ్రామాల ప్రజలు ప్రయాణించాలి. అయితే ఈ వంతెన కూలిపోతే రాకపోకలు స్తంభించిపోతాయి. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోని వంతెన నిర్మిం చాలని ప్రజలు కోరుతున్నారు.

# రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

నర్సీపట్నం : ధర్మసాగరంలోని ఆర్‌డిఎఫ్ గ్రాంటు కింద రోడ్డు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు రూ.20లక్షల మంజూరు చేయగా మడ్డు రాజు ఇంటి వద్ద నుంచి శెట్టి ముత్యాలు ఇంటి వరకు రూ.5లక్షలు, పాల కేంద్రం నుండి పెట్ల అచ్చిరాజు పాక వరకు రూ.5లక్షల సైడ్‌వాల్స్, సుకల ఎర్రినాయుడు ఇంటి నుండి సుకల జోగినాయుడు ఇంటి వరకు రెండున్నర లక్షల వరకు సిసి రోడ్డు, సైడ్‌వాల్స్, సత్య వద్ద నుండి సియాద్రి సత్య వరకు రోడ్డు రూ.2లక్షలు రోడ్డు, శెట్టి అప్పలనాయుడు ఇంటి నుంచి భీమిరెడ్డి అప్పలనాయుడు ఇంటి వద్దకు సిసి రోడ్డు రూ.2.50లక్షలు మొత్తం 20లక్షల పనులు గురువారం ప్రారంభించారు. నీటి సంఘం అధ్యక్షులు, నీటి సంఘం అధ్యక్షులు నిద్ర మాతునాయుడు, పాల కేంద్రం ప్రెసిడెంట్ భీమిరెడ్డి అప్పలనాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కళ్లెంపూడి సత్తిబాబు, వార్డు మెంబర్లు ఈ కార్యక్రమం పాల్గొన్నారు.

### ప్రమాదంలో

# వ్యక్తికి గాయాలు



నర్సీపట్నం : వేములపూడి ప్రాథమిక సహకార బ్యాంకు మలుపు వద్ద ఆటో, బైక్ ఢీకొన్నాయి. సంఘటనలో దుగ్గాడ గ్రామానికి చెందిన నాయుడు ముడుకికి గాయాల య్యాయి. స్థానికులంతా తోడు పట్టి ఆటోలో స్థానిక పిహెచ్‌సికి తరలించారు. డాక్టర్ సౌమ్య సభకు చికిత్స అందించారు.

ఇళ్లు, అపార్ట్‌మెంట్, ఇళ్ల స్థలములు కొనాలన్నా, అమ్మాలన్నా, తనఖా, అన్ని రకముల లోన్ సదుపాయములు బ్యాంక్ ద్వారా సమకూర్చుటకు సంప్రదించగలరు.
79815 79817

**IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM.**

**I.P.No. 3/2017**

**Between:**
**Sri.Gandi Ravindranath Tagore Naidu ...Petitioner**
**And:**
**Sri.Boni Satyanarayana ...Respondent.**
**To**
**Boni Satyanarayana,**
**S/o. late Narayana,**
**R/o. Ganga Chollapenta Village,**
**Gajapathinagaram Mandal,**
**Vizianagaram District.**

**NOTICE**

Take notice that the above insolvency petition filed by the petitioner stands posted to **dt.27-11-2017** for your appearance either in person or through an advocate before the above said court at **10:30 A.M.,** failing which the matter will be decided in your absence.

**(BY ORDER)**
**Adurthi Suryanarayana Murty,**
**Adurthi Vasudev,**
**Advocates for the petitioner.**
**Gurachari Street,**
**Vizianagaram.**

Vizianagaram
Date :14-11-2017

**IN THE HONOURABLE COURT OF PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM.**

**E.P.81/2017**
**O.S.259/2009**

**Between**
**K.Chinna Talli ...DHR**
**And**
**M.Krishna Rao ...JDRs**
**To:**
**1.Madasi Krishna Rao,**
**S/o.Laxman Rao,**
**r/at 1-201, Flat No.301,**
**Parvathi Residency,**
**Sapthagiri Nagar,**
**Chinamushidivada,**
**Pendurthy, Visakhapatnam.**

**NOTICE**

Take notice in the above E.A 81/2017 filed to order the sale of property in Flat No.SF 1 in the 2nd floor, parvathi Residency, Chinamushidivada, Visakhapatnam. That the matter stands posted to **20.12.2017** for our appearance before the Honble court by **10.30 am** on that day, failing to appear either in person or through advocate, the matter will be decided at your absence.

**Smt.V.(G).VIJAYA**
**S.NAGESH KUMAR**
**Advocates**
**Door No.36-16-1,**
**Kotha Reddy,**
**Kancharapalem,**
**Visakhapatnam-530008**

Visakhapatnam
Date: 16-11-2017

# సీనియర్ జర్నలిస్టులకు సత్కారం

యానాం : ప్రతికారంగంలో ఏళ్ళతరబడి పనిచేసిన ఇద్దరు జర్నలిస్టులను యానాం జర్నలిస్టు ఆసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. గురువారం సాయంత్రం స్థానిక మినీ సివిల్‌స్టేషన్‌లో విలేకరుల కార్యాలయంలో జాతీయ దినపత్రికల దినోత్సవాన్ని పురస్కరించు కొని పత్రికా రంగంలో 27 సంవత్సరాలు సేవలందించినందుకు గాను దుశ్శాలవ, మెమోంటొ, పూలమాలతో సత్కరించారు. పుదుచ్చేరి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో పాటు జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేయాలని అంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలను పుదు చ్చేరి ప్రభుత్వం అమలుచేసేలా చర్యలు చేపట్టాలని యానాం జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జాప్) అధ్యక్షులు దున్నా చక్రవర్తి డిమాండ్‌చేశారు.

యానాంలో ఏళ్ళతరబడి పనిచేసే విలేకరులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంలో తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. పత్రికలకు ఇచ్చే ప్రభుత్వ ప్రకటనలకు సంబంధించి అన్ని పత్రికలకు 2005 నుండి ఇప్పటివరకు బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తున్నారని తక్షణం నిధులు విడుదలచేసి బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. బిల్లులు చెల్లించకపోతే ప్రభుత్వ ప్రకటనలను ఇప్పటికే ప్రముఖ పత్రికలు నిలిపివేసిన విషయన్ని గుర్తుచేశారు. అలాగే యానాంలో ప్రచరించే ప్రకటనల బిల్లులను యానాంలోనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారన్నారు. 25 సంవత్సరా లు పత్రికారంగంలో సేవలు అందించిన చేత శివశేషుబాబు, పొడుగుమట్ల అశోక్‌కుమార్‌లను ఈ సందర్భంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఎం. గిరిబాబు, ఉపాధ్యక్షులు బద్రి, కోశాధికారి ఎల్. వెంకన్న బాబు, విత్తనాల వెంకటేశ్వరరావు, శంకర్, గణేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణానది బోటు ప్రమాద బాధితులకు రూ. 20లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

## - పర్యాటకశాఖ మంత్రి అఖిల ప్రియ వెంటనే రాజీనామా చేయాలి

## - వైకాపా డిమాండ్

గాజువాక: ఇటీవల కష్ణానదిలో జరిగిన బోటు ప్రమాద బాధితులకు రూ. 20లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం ఇచ్చి ఆదుకోవాలని వైయస్ఆర్ ఎస్సీ సెల్ మహిళ విభాగం సిటీ ప్రధాన కార్యదర్శి జి.రోజారాణి డిమాండ్ చేసారు. గురువారం గాజువాకలో వైయస్ఆర్ ఎస్సీ సెల్ మహిళ విభాగం సిటీ ప్రధాన కార్యదర్శి జి.రోజారాణి ఆద్వర్యంలో జీవియంసీ జోన్-5 కార్యాలయం వద్ద కృష్ణానది పడవ ప్రమాదంలో మరణించిన యాత్రికులకు సంతాపగంగా కొవ్వుత్తుల ప్రదర్శన, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక వైకాపా సమన్వయకర్త తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ కృష్ణనది బోటు ప్రమాదంలో సుమారు 23మంది మృతిచెందారని దీనికి కారణం తెదేపా అసమర్ధ పాలనేనని విమర్శించారు. బోటు యజమానులకు ఎటువంటి అనుమతులు లేవని, ఇన్సురెన్స్, బోటునడుపుతున్న డ్రైవర్స్‌కు ఎటువంటి లైసెన్స్‌లు గాని లేవని విమర్శించారు.




ఇలాంటి వాటిని పర్యాటకరంగం ఏవిధంగా అనుమతులను జారీ చేసిందని ప్రశ్నించారు. వైయస్ఆర్ ఎస్సీ సెల్ మహిళ విభాగం సిటీ ప్రధాన కార్యదర్శి జి.రోజారాణి మాట్లాడుతూ పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిల ప్రియ అసమర్ధ పాలన వలనే ఇటువంటివి జరుగుతున్నాయని విమర్శించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేసారు. రూ. 20లక్షల ఎక్స్‌గ్రేసియాగా ప్రకటించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఎన్నేటి రమణ, మార్డుపూడి పరదేశి, రాజానవెంకటరావు, సంపంగి ఈశ్వరరావు, ఈగల పాటి యువశ్రీ, శాంతకుమారి, సారిపల్లి సత్యవతి, కమారన్‌షాబేగం, సారిపల్లి వెంకటలక్ష్మి, రత్నం, ప్రసన్న, దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర క్రీడలశాఖ మంత్రిని కలిసిన మంత్రి మల్లాడి

యానాం : పుదుచ్చేరి రాష్ట్రానికి సంబంధించి పలు సమస్యలను పరిష్కరించాలని కేంద్ర క్రీడశాఖ మంత్రి రాజీవ్ వర్ధన్‌సింగ్ రాథోడ్‌ను పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి. నారాయణసామి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావులు కలిసి విజ్ఞాప్తిచేశారు. ఖేల్‌ఇండియాలో పుదుచ్చేరి రాష్ట్ర పర్యాటకరంగ అభివృద్ధికి రూ. 54 కోట్ల 70 లక్షల ప్రతిపాదనలను ఇవ్వడం జరిగింది. దీనిపై జనవరిలో సమీక్షించి నిధులు విడుదల చేసేందుకు హామీఇచ్చారు. పుదుచ్చేరిలోని మెడికల్ కాలేజ్ అవరణలో మల్టీపర్పస్ నిర్మాణానికి రూ. 7.85 కోట్ల నిధుల ఇవ్వాలని కోరారు. సావిత్రినగర్ క్రీడా ప్రాంగణ అభివృద్ధికి రూ. 3 కోట్లు, గిరియంపేట క్రీడా ప్రాంగణ అభివృద్ధికి రూ. 3కోట్ల 91 లక్షలు, మెట్టకూరు క్రీడా ప్రాంగణ అభివృద్ధికి రూ. 73 లక్షల నిధుల విడుదలచేయాలని కోరారు.

పెండింగ్‌లో ఉన్న నిధులతోపాటు ఈ నిదులు కూడా దశలవారీగా ఇచ్చేందుకు అధికారులతో సమీక్షించి ఏర్పాటు చేస్తానని కేంద్ర క్రీడామంత్రి, క్రీడాశాఖ కార్యదర్శి హామీ ఇవ్వడం జరిగిందని మంత్రి మల్లాడి తెలిపారు.

వీరితోపాటు మాజీ ఎమ్మెల్యే జాన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మల్కాపురం శాఖా గ్రంధాలయంలో ఘనంగా కవిసమ్మెళనం



సింథియా: పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం శాఖా గ్రంధాలయంలో గురువారం కవిసమ్మెళనాన్ని ఘనంగా నిర్వహించారు. 50వ జాతీయ గ్రంధాలయవారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అధ్యక్షత వహించిన సిరషం అధ్యక్షులు జి.కె.వి.రాజు మాట్లాడుతూ కవి సమ్మెళనము వలన సాహిత్యవేత్తలకు వేదిక అవుతుంది. విద్యార్ధులకు అవసరమైన సమాచారం అందుతుందన్నారు. భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగడానికి దోహదపడుతుందని, సాంఘిక, రాజకీయ స్పృహ కల్గుతుందని అన్నారు. శిరసం కార్యదర్శి సుంకర చలపతిరావు మాట్లాడుతూ గ్రంధాలయంలో చదువుకొనడంవలన ఎక్కువ ఉపయోగాలు ఉన్నాయని అన్నారు.

16మంది కవులు కవిసమ్మెళనంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. టి.శ్రీరామమూర్తి, రామలక్ష్మి, కొత్తపల్లి బంగారాజు, సి.హెచ్.రామారావు, సి.హచ్.బాస్కరరావు, పాపారావు, బగ్గాం సత్యనాందరావు, ఎస్.ఆర్.వి ప్రసాదురావు, కరకు సత్తిరాజు, మంగళగిరి ప్రసాదరావులు,రావులపల్లి రామలక్ష్మి కవులకు సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో వి.వి.మోహనరావు, డి.యస్.మనోహర్, అడుసు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు. గ్రంధాలయాధికారి వి.అజయ్ కుమార్ వందన సమర్పరణతో కార్యక్రమం ముగిసింది.

# గణబాబుకు శుభాకాంక్షలు తెలిపిన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం



విశాఖపట్నం : ఇటీవల ప్రభుత్వ విప్‌గా నియమితులైన పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు పి జి వి ఆర్ నాయుడు (గణబాబు) గ్రేటర్ విశాఖ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు మరియు తెలుగుదేశం పార్టీ ఆర్బన్ కార్యదర్శి నరవ పైడిరాజు ఆధ్వర్యంలో కమిటి సభ్యులు అందరూ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చల్లాపల్లి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి దేవగుప్త రమేష్, కంది కొండ శ్రీను, కె. రాజు, ఎస్ కోటేశ్వరరావు, కె. శ్రీను, టి. రాజు, పి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రచ్చబండలో ప్రభుత్వంపై విరుచుకుపడ్డ మళ్ళ



సింథియా: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో తెదేపా పూర్తిగా విఫలం అయ్యిందని వైకాపా నగర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మళ్ళ విజయప్రసాద్ తెదేపా ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. గురువారం జీవియంసీ 48వ వార్డులో వైకాపా అధ్వర్యం లో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో మళ్ళ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెదేపా అమలు కాని హామీలనిచ్చి గద్దెనెక్కి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. బాబు వస్తే జాబు అని చెప్పి నిరుద్యోగ యువతను మోసం చేసారని మండిపడ్డారు. రాజధాని అమరావతిలో తాత్కాలిక కట్టడాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేసారు. వైకాపా రాష్ట్ర అధ్యక్షులు, ప్రతిపక్షనేత వైయస్ జగన్ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రజాసంకల్పయాత్రను చేపట్టారని, ప్రజలు వైయస్‌కు నీరాజనాలు పడుతున్నారని, వైకాపా రాష్ట్రంలోని అధకారంలోకి రావడం తథ్యమని ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. తెదేపా పాలన లోపాలను ప్రజలవద్దకు తీసుకెళ్ళేందుకు కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కలిదిండి బద్రినాద్, మూగి సూర్యనారాయణ, కొల్లి నూకరెడ్డి, మళ్ళధనలత, వైకాపా కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.




# అంతర్జాతీయ అంతర పాఠశాలల సాంస్కృతి ఉత్సవాల్లో కే.జి.బి.వి.పాఠశాల విద్యార్థినిలు

భీమునిపట్నంలో గల కస్తూరిభా గాంధీ పాఠశాల విద్యార్థినిలకు నవంబర్ 12 నుండి 14 వరకు వాసిరెడ్డి ఇన్స్టిట్యూట్ టెక్నాలజీ నంబూరు లో నిర్వహించిన అంతర్జాతీయ అంతర పాఠశాలల సాంస్కృతి ఉత్సవాల్లో కే.జి.బి పాఠశాల పి.జ్యోసత్న తొమ్మిదో తరగతి చదువు తున్న విద్యార్థినికి కధవిశ్లేషణ లో సెకండ్ ,అలాగే కె భావన కు లేఖ రచనలో బహుమతులు గెలిపొందారని స్పెషల్ ఆఫీసర్ కె .గ్రేస్ లిల్లి తెలిపారు .వారిని ఉపాధ్యాయులు అభిన దించారు.



# సముద్రంలో భీమిలికి చెందిన బోటు మునక

భీమునిపట్నంః ఎగువపేట కు చెందిన బర్రి అమ్మోరమ్మ యొక్క మరబోటు ఎఫ్.వి.ఎస్.ఎం.772 విశాఖపట్నం నుండి ఎనిమిది మంది మత్యకారులు, కళాసిలు వేటకు బయలుదేరి వెళ్ళుతుండగా తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం ఇసకపాలెం గ్రామం వద్దకు వచ్చేసరికి బోటు అడుగుబాగం ద్రదం పడడముతో మత్యకారులు,కళాసిలు అందరూ సముద్రంలో దూకి వారి ఈదుకుంటూ వడ్డుకు వచ్చి ప్రాణాలను కాపాడు కున్నారు.బోటులో పూర్తిగా నీరు చేరి అక్కడే సముద్రం లో మునిగిపోవడంతో సుమారు ముప్పయి లక్షలు బోటు మునిగి పోవడం తో యజమానురాలు బర్రి అమ్మోరమ్మ,మరియు వేట మీద ఆధారపడి బ్రతికే ఎనిమిది మంది మత్యకారులకి ఎటువంటి ఆధారం లేక దిక్కుతోచని పరిస్తులలో ఉన్నారు.వారిని ఎలాగైనా ఆదుకోవాలని ఉద్దేశ్యం తో భీమిలి టౌన్ టి.డి.పి.అధ్యక్షులు గంటా నూకరాజు, మంత్రులు మానవవనరుల శాఖ గంటా శ్రీనివాసరావు, మత్య శాఖ ఆదినారాయణ రెడ్డి గార్లకు,మరియు ఎమెల్యే గణేష్ కుమార్ కు ,జే.డి ఫిషేరేస్ వినతి పత్రం అందజేశారు.

# బేడీ వ్యవహారశైలిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

## - నారాయణసామి

యానాం : పుదుచ్చేరి ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పాలనా వ్యవహారాల్లో అతిగా జోక్యం చేసుకుంటున్న లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ బేడీ వ్యవహారశైలిపై న్యాయస్థాఖనాన్ని ఆశ్రయించడం మినహా మరో మార్గం కనిపించడం లేదని ముఖ్యమంత్రి వి.నారాయణసామి ప్రకటించారు. ఇక్కడి పీసీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ లెఫ్టినెంట్ గవర్నర్ తీరుపై కేంద్రహోం మంత్రికి కనీసం 20 సార్లు ఫిర్యాదు చేశామని, వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దిల్లీలో ఆప్ ప్రభుత్వం పాలనలో అక్కడి లెఫ్టినెంట్ గవర్నర్ అతి జోక్యం గురించి సుప్రీం కోర్టును ఆశ్రయించగా ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా అతిజోక్యం తగదంటూ ఆక్షేపించారని తెలిపారు. చెన్నై హైకోర్టులో లెఫ్టినెంట్ గవర్నర్ తీరుపై దాఖలు చేయనున్న కేసులను కాంగ్రెస్ మాజీ మంత్రి కపిల్ సిబాల్ పర్యవేక్షిస్తారన్నారు. కేంద్రం ప్రతిపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాలకు నిధుల జారీ విషయంలో వివక్ష కనబరుస్తోందని నారాయణసామి ఆరోపించారు. రాష్ట్రాలకు 42శాతం నాన్ ప్లాన్ వ్యయం కింద ఇస్తున్న కేంద్రం పుదుచ్చేరికి 27శాతం ఇస్తోందని, తమకు రూ.2,850కోట్లు ఖర్చవుతుంటే రూ.527కోట్లు మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. డిప్యుటేషన్‌పై అధికారుల బదిలీని వ్యతిరేకిస్తున్న కిరణ్‌బేడీ తన కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన 64 మంది అధికారులను ఎలా నియమించుకున్నారని సీఎం ప్రశ్నించారు.

రోజువారీ వ్యవహారాల్లో లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ జోక్యం చేసుకోవడానికి వీలు కల్పిస్తూ కేంద్రహోంశాఖ జారీ చేసిన బిజినెస్ రూల్ 21(5)ను సమీక్షించాలంటూ ముఖ్యమంత్రి పార్లమెంట్ సెక్రటరీగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే కె.లక్ష్మీనారాయణ చెన్నై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బిజినెస్ రూల్ 21(5) గురించి కేంద్రహోంశాఖ పేర్కొన్న అంశాలకు ఆ శాఖ వెబ్‌సైట్‌లో ఉన్నఅంశానికి వైరుధ్యం ఉందని, దీనిపై విచారణ జరిపి సవరించాలని లక్ష్మీనారాయణ కోరారు. దీనిపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.రామచంద్ర అయ్యర్ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు

# క్షయవ్యాధి నివారణపై అవగాహన



పిఠాపురం : జాతీయ క్షయవ్యాధి నివారణా కార్యక్రమంలో భాగంగా నరసింగపురంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పిఠాపురం మండలం మల్లాం పిహెచ్‌సి పరిధిలోని నరసింగపురం గ్రామంలో పిహెచ్‌సి వైద్యాధికారిణి డా.ఎమ్.ప్రియాంక క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఎవరికైనా రెండువారాలు మించి దగ్గు ఏర్పడినా, ప్రతిరోజూ జ్వరం వస్తున్నట్లు అనిపించినా, బరువు తగ్గుతున్నట్టు భావించినా, దగ్గినప్పుడు కల్లిలో రక్తం కనిపించినా క్షయ వ్యాధికి ప్రాథమిక లక్షణాలని తెలిపారు. వ్యాధి సోకినవారు సక్రమంగా మందులు వాడకపోయినచో అతను దగ్గడం ద్వారా ప్రక్కన ఉన్నవారికి వ్యాధిసోకే అవకాశం ఉందన్నారు. గతంలో డాట్స్ ద్వారా వారమునకు మూడు రోజులు మందులు వేసుకునేవారని, ప్రస్తుతం నూతనంగా ఫిక్స్‌డ్ డే డ్రగ్ ప్రతిరోజు వేసుకునే పద్ధతి ప్రారంభమైందన్నారు. రోగుల వ్యాధియొక్క తీవ్రతను బట్టి 8నెలల చికిత్స అందుబాటులో ఉందన్నారు. ఈ మందులు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా అందజేస్తారు. నరసింగపురం గ్రామంలో 46 మంది అనుమానిత క్షయవ్యాధి లక్షణములున్న వారిని గుర్తించి కల్లి, రక్త పరిక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి నిర్ధారణ అనంతరం టి.బి.చికిత్స ప్రారంభిస్తా మన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఓలేటి పాపారెడ్డి, పిహెచ్‌సి సూపర్‌వైజర్ బధ్రం, హెల్త్ ఆసిస్టెంట్ వెంకటేశ్వరులు, ఏఎన్‌యమ్‌లు లక్ష్మీభాయ్, కృష్ణవేణి, పెద్దాపురం టి.బి.యూనిట్ ఎస్.టి.ఎస్ రమణ, ఎస్.టి.ఎల్.ఎస్.రాము మరియు ఆశాలు పాల్గొన్నారు.

# డేటాతో అనుసంధానం ద్వారా

# చిన్న తరహా రైతులకు ఉపయోగం





విశాఖపట్నం : దత్తాంశం (డేటా)తో అనుసంధానం ద్వారా చిన్న రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ రంగ నిపుణులు సూచించారు. విశాఖపట్నంలో జరుగుతున్న అగ్రిటెక్ సమ్మిట్ 2017లో భాగంగా రెండవ రోజు గురువారం మధ్యాహ్నం చిన్న తరహా రైతులకు దత్తాంశంతో అనుసంధానం (హార్నెస్సింగ్ బిగ్ డేటా ఫర్ స్మాల్ ఫార్మర్స్) అనే అంశంపై నిపుణులు, రైతులతో సదస్సు జరిగింది. ఈ సస్సు ప్రపంచ బ్యాంకు గ్లోబల్ లీడ్ ఫర్ రూరల్ లైవ్లీహుడ్స్ అండ్ అగ్రికల్చరల్ జాబ్స్ విభాగం ప్రతినిధి పరమేష్ షా నేతృత్వంలో జరిగింది. ఈ సదస్సులో డాల్‌బెర్గ్ డేటా ఇన్‌సైట్స్ సహ వ్యవస్థాపకులు మరియు మేనేజింగ్ పార్టనర్ ఫ్రెడరిక్ పివెట్టా, క్రాపిన్ టెక్నాలజీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, సహ వ్యవస్థాపకులు కునాల్ ప్రసాద్, శాట్ స్క్వేర్ ఎనలిటిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సిఓఓ ప్రతీప్ బాసు, అగ్రిస్కీ డేటా ఎనలిటిక్స్ సిఇఓ రవిశంకర్ మంథా పాల్గొన్నారు.

దత్తాంశాన్ని చిన్న తరహా రైతులతో సహా మధ్య తరహా రైతులకు ఇతర అంశాలకు వివిధ రకాలుగా ఉపయోగించుకునే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున డిజిటలైజేషన్ ద్వారా దత్తాంశాన్ని వినియోగించుకునే ప్రయత్నం ముదావహం అన్నారు. సరైన దత్తాంశంతో వ్యవసాయానికి చక్కని ప్రణాళికలు రూపొందించవచ్చని చెప్పారు. తద్వారా రైతుల సాధికారత సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. దత్తాంశ సేకరణ, అనుసంధానం, డిజిటలైజేషన్ వంటి విషయాలలో ప్రభుత్వం కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని వేదికపై ఉన్న వక్తలు అభిప్రాయపడ్డారు.

ఏ ప్రాంతంలో ఎటువంటి పంటలు వేయాలి? ఏ కాలంలో వేయాలి? నీటిని ఏ విధంగా వినియోగించుకోవాలి? క్రిమి సంహారకాలు వీటిపై వినియోగించాలి వంటి అనేక అంశాలను గూర్చిన వివరాలు లభిస్తుందని చెప్పారు. దత్తాంశం ఉండడం వలన భూసారం రకం, భూ ఆరోగ్యం వంటి అంశాలు వివరంగా తెలుస్తుందని కునాల్ ప్రసాద్ తెలిపారు. రైతులు ఒకే విధమైన పంటలు వేయడం వంటి అంశాలు తరచూ ప్రస్తుత రోజుల్లో జరుగుతుందని ఇటువంటివి మిస్‌మ్యాచ్ కాకుండా (తలెత్తకుండా) దత్తాంశం ఉపయోగపడుతుందని కునాల్ ప్రసాద్ అన్నారు. రిమోట్ సెన్సింగ్ తదితర విధానాల ద్వారా లభ్యమయ్యే దత్తాంశాన్ని సేకరించి వినియోగించవచ్చని చెప్పారు. దత్తాంశ సేకరణ వలన బహుళ అంశాలకు సంబంధించిన వివరాలు లభ్యంగా ఉంటాయని తద్వారా పంటల బీమా వంటి అంశాలకు చక్కగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రైతులకు రుణాలు అందించడంలో కీలక పాత్ర వహిస్తుందని ఆయన అన్నారు. దత్తాంశం ఉపయోగించుకుని రైతులకు ఉపయోగపడే విధంగా విజ్ఞానదాయకంగా మలచాలని రవిశంకర్ మంథా అన్నారు. రైతులకు ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ చేయుటకు, డిజిటలైజేషన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ చేయుటకు బాగా తోడ్పడుతుందని ఫ్రెడరిక్ అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న దత్తాంశంలో చాలా వరకు తప్పులు దొర్లుతున్నాయని, తప్పులు తలెత్తకండా తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సదస్సులో పాల్గొన్నవారు సూచించారు. ఈ సదస్సులో వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.














## విశాఖకు 80 కి.మీ. దూరంలో

# వాయుగుండం

- ఉత్తర కోస్తాలో పలుచోట్ల భారీ వర్షాలు
- గంటకు 50-55 కి.మీ. వేగంతో గాలులు
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు
- వాతావరణ అధికారుల హెచ్చరికలు




విశాఖపట్నం: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతోంది. విశాఖకు తూర్పు ఆగ్నేయ దిశగా 80 కిలోమీటర్లు, గోపాల్‌పూర్‌కు దక్షిణ నైరుతి దిశగా 210 కిలోమీటర్ల దూరంలోనూ వాయుగుండం కేంద్రీకృతమై ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న 24 గంటల పాటు వాయుగుండం స్థిరంగా కొనసాగుతూ ఉత్తర ఈశాన్య దిశగా కదులుతోందని, ఆ తర్వాత ఉత్తర కోస్తాంధ్ర, ఒడిశా తీరాలకు చేరువగా వచ్చి క్రమంగా బలహీన పడుతుందని అధికారులు చెబుతున్నారు. దీని ప్రభావంతో ఉత్తరకోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. ఉత్తర కోస్తాంధ్ర తీరం వెంబడి గంటకు 50-55 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని వెల్లడించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు.

### మాజీ ఉద్యోగులు

## ఈపీఎఫ్ వడ్డీపై పన్ను కట్టాల్సిందే

**ఆదాయపు పన్ను శాఖ**




ముంబై : ఉద్యోగం చేయడం మానేసిన తర్వాత భవిష్య నిధి ఖాతాలో జమ అయ్యే వడ్డీపై పన్ను కట్టవలసిందేనని ఆదాయపు పన్ను శాఖ అపిలేట్ ట్రిబ్యునల్ -బెంగళూరు బెంచ్ ఇటీవల ఇచ్చిన ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఉద్యోగులు తమ పదవీ విరమణ లేదా తొలగింపు లేదా రాజీనామా అనంతరం కూడా ఈపీఎఫ్ (ఉద్యోగుల భవిష్య నిధి) ఖాతాలను కొనసాగిస్తున్నారని, వాటిలోని సొమ్ముపై వడ్డీని పొందుతున్నారని నిపుణులు చెప్తున్నారు. ఇటువంటి ఉద్యోగులు తమ సొమ్ముపై వచ్చే వడ్డీపై పన్ను చెల్లించాలన్న విషయాన్ని తెలుసుకోవడం లేదని అంటున్నారు.

## మాల్యాకు భారీషాక్!

**బ్యాంకు ఖాతాలన్నీ స్వాధీనం**

న్యూఢిల్లీ: భారీ పన్ను ఎగవేతదారుడు విజయమాల్యాకు మార్కెట్ రెగ్యులేటరీ సెబి మరోసారి భారీ షాక్ ఇచ్చింది.

పెండింగ్ బకాయిల వసూళ్లలో భాగంగా మాల్యాకు చెందిన కీలక సంస్థ బ్యాంకు ఖాతాలను ఎటాచ్ చేసింది. ఈ మేరకు నవంబరు 13న విడుదల చేసిన అటాచ్‌మెంట్ నోటీసులో, మాల్యాకు ఎలాంటి చెల్లింపులు చేయరాదని సంబంధిత బ్యాంకులకు, సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది.

మాల్యా ఆధ్వర్యంలోని యునైటెడ్ బ్రేవరీస్ (హోల్డింగ్స్) లిమిటెడ్‌కు చెందిన అన్ని బ్యాంకు ఖాతాలు, డీమాంట్ ఖాతాలు, షేర్లను, మ్యూచువల్ ఫండ్ ఖాతాలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. రూ.18.5 లక్షల మొత్తాన్ని తిరిగి పొందేలా వీటిని ఎటాచ్ చేసింది.

యూబీహెచ్‌ఎల్ పై విధించిన జరిమానా చెల్లించడంలో విఫలం కావడంతో సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. రూ. 15 లక్షల ప్రారంభ జరిమానా, రూ.3.5 లక్షల వడ్డీ, ఖర్చులు వెయ్యి రూపాయలతో సహా మొత్తం బకాయి రూ. 18.5 లక్షలుగా నిర్ణయించింది.

కాగా 2015 లో, సెబీ కంపెనీ 15 లక్షల రూపాయల జరిమానా విధించింది. 2016 డిసెంబర్ నాటికి విజయ్ మాల్యాకు యునైటెడ్ బ్రూవరీస్‌లో 7.91శాతం వ్యక్తిత వాటా ఉంది. వివిధ సంస్థల ద్వారా మొత్తంవాటా 52.34శాతం.

# తొలిరోజు బెంబేలెత్తించిన లక్మల్

## కోహ్లీ, కేఎల్ రాహుల్ డకౌట్



కోల్‌కతా: చిరుజల్లులు.. వెలుతురులేమి.. ఈ రెండు సమస్యలతో భారత్-శ్రీలంక మధ్య తొలి టెస్టు మొదటి రోజు ఆట సజావుగా సాగలేదు. ఉదయం 9గంటలకు పడాల్సిన టాస్ వర్షం కారణంగా ఆలస్యమైంది. వర్షం తగ్గుముఖం పట్టడంతో మధ్యాహ్నం 12.45గంటలకు మైదానాన్ని పరిశీలించిన నిర్వాహకులు ఒంటి గంటకు టాస్ వేయించారు. టాస్ గెలిచిన లంక వ్యూహాత్మకంగా వ్యవహరించి బౌలింగ్ ఎంచుకుంది. తొలి రోజు తొలి సెషన్ పూర్తిగా రద్దయ్యింది. అనంతరం మధ్యమధ్యలో వర్షం, వెలుతురు లేమి సమస్య వెంటాడుతూనే ఉన్నాయి. సాయంత్రం 4.20గంటలకు అంపైర్లు వెలుతురు లేమి కారణంగా మ్యాచ్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఆ సమయానికి భారత్ 3 వికెట్ల నష్టానికి 17 పరుగులు చేసింది. క్రీజులో పుజారా(8), రహానె క్రీజులో ఉన్నారు.

**తొలి బంతికే వికెట్**

టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన భారత్‌కు శుభారంభం దక్కలేదు. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ కేఎల్ రాహుల్.. వికెట్ కీపర్ డిక్వెల్లాకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాటపట్టాడు.

రాహుల్ డకౌట్‌గా వెనుదిరగడంతో పుజారా క్రీజులోకి వచ్చాడు. అనంతరం 6.2వ ఓవర్లో లక్మల్ వేసిన బంతికి ధావన్(8) బౌల్డయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కోహ్లీ కూడా కుదరుకునేందుకు ఇబ్బందిపడ్డాడు. 10.1వ ఓవర్లో లక్మల్.. కోహ్లీని డకౌట్‌గానే పెవిలియన్‌కు పంపాడు. ఆరు ఓవర్లు వేసిన లక్మల్ ఒక్క పరుగు కూడా ఇవ్వలేదు. పదునైన బంతులతో భారత టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు.

**వర్షం, వెలుతురు లేమి సమస్య**

తొలి రోజు ఆట పట్టుమని గంట సేపు కూడా సజావుగా సాగలేదు. విరామాల మధ్యే అంచెలంచెలుగా మ్యాచ్ నిర్వహించారు. 8.2 ఓవర్ల వద్ద వర్షం, వెలుతురు లేమి సమస్య కారణంగా కొద్దిసేపు మ్యాచ్‌ను నిలిపివేశారు. ఆ తర్వాత ప్రారంభించినా వెలుతురు లేమి సమస్య వెంటాడుతూనే ఉంది. 12వ ఓవర్లో లాహిరు గమేజ్ వేసిన ఐదో బంతిని ఎదుర్కొనేందుకు పుజారా ఇబ్బంది పడ్డాడు. బంతి సరిగా కనిపించడంలేదని అంపైర్లకు తెలిపాడు.

దీంతో వారు మ్యాచ్‌ను నిలిపివేశారు. సాయంత్రం 4.20 గంటలకు వెలుతురు సమస్య కారణంగా 11.5 ఓవర్ల వద్ద తొలి రోజు ఆటను నిలిపివేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. తొలి రోజు మ్యాచ్ ముగిసే సమయానికి భారత్ 3 వికెట్ల నష్టానికి 17 పరుగులు చేసింది.

క్రీజులో పుజారా(8), రహానె ఉన్నారు. శ్రీలంక బౌలర్ సురంగ లక్మల్ ఆరు ఓవర్లలో ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా మూడు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు.

# విదేశీ పెట్టుబడిదారులతో రాహుల్ భేటీ

దిల్లీ: కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ విదేశీ పెట్టుబడి దారులతో దిల్లీలో సమావేశమయ్యారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ సవాళ్లపై చర్చించడంతో పాటు వాటిని అధిగమించే మార్గాలపై ఈ భేటీలో చర్చించనున్నట్లు ట్వీట్ చేశారు. వారితో కలిసి దిగిన గ్రూపు ఫొటోను రాహుల్ ట్వీటర్‌లో పోస్ట్ చేశారు. వారిలో చాలామంది భారత సంతతికి చెందినవారే ఉన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమల్లో వచ్చిన తర్వాత జీడీపీ తగ్గినట్లు కాంగ్రెస్ ఆరోపిస్తున్న నేపథ్యంలో రాహుల్‌గాంధీ విదేశీ పెట్టుబడిదారులతో సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**తల్లిని మించిన తనయుడు రాహుల్**

భారతదేశ రాజకీయాల్లో అత్యంత ప్రజాదరణగల రాజకీయ నేతగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొనసాగుతున్నారు. దేశవ్యాప్తంగా 2,464 మంది పాల్గొన్న సర్వే ఫలితాలను ప్యూ అనే సంస్థ గురువారం ప్రకటించింది. ఈ సర్వేలో మోదీకి 88 శాతం మంది మద్దతు లభించింది. కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీకి 58 శాతం, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీకి 57 శాతం, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు 39 శాతం మంది మద్దతు పలికారు. ఈ ఏడాది ఫిబ్రవరి 21 నుంచి మార్చి 10 మధ్యలో ఈ సర్వేను నిర్వహించారు. ఆర్థిక పరిస్థితులు బాగున్నాయని 80 శాతం మంది చెప్పారని ప్యూ తెలిపింది. ఆర్థిక వ్యవస్థ చాలా బాగుందని చెప్పినవారు 30 శాతం మంది అని తెలిపింది. దేశంలోని పరిస్థితులపై 70 శాతం మంది సంతృప్తి చెందుతున్నారని పేర్కొంది.

2014 నుంచి భారతదేశంలో సానుకూల పరిస్థితులు దాదాపు రెట్టింపు అయ్యాయని తెలిపింది.

# ఏపీ అగ్రిటెక్ సదస్సులో 2వ రోజు దృశ్యమాలిక



రెండవ రోజు సదస్సుకు హాజరౌతున్న కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, సీఎం చంద్రబాబు నాయుడు, విశాఖ ఎంపీ హరిబాబు తదితరులు




కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను సన్మానిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, చిత్రంలో వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీలు కంభంపాటి హరిబాబు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు



కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు నూతన సాంకేతిక పరికరం గూర్చి వివరిస్తున్న శాస్త్రవేత్త



అగ్రిటెక్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించిన కేంద్ర సహాయ మంత్రి షెకావత్



సేంద్రీయ వ్యవసాయంపై తగుసూచనలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి షెకావత్



సదస్సుకు హాజరైన రైతులతో వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రశేఖర రెడ్డి



అగ్రికల్చర్ విద్యార్థినులకు సాంకేతిక పరిజ్ఞానంపై వివరిస్తున్న శాస్త్రవేత్త




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com